ప్రజాశక్తి

ఆదివారం 21 ఏప్రిల్ 2024 పేజీలు 8

విజయనగరం పార్వతీపురం మన్యం

మూడో రోజు 14 నామినేషన్లు

పార్లమెంట్ స్థానానికి నిల్

నామినేషన్ వేస్తున్న వైసిపి విజయనగరం అసెంబ్లీ అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, కోట

విజయనగరం జిల్లాలో మూడో రోజు శనివారం నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 14 నామినేషన్లు దాఖలు అయ్యాయి. విజయనగరం ఎంపి స్థానానికి ఒక్క నామినేషన్ కూడా రాలేదు. అసెంబ్లీ స్థానాలకు సంబంధించి విజయనగరంలో వైసిపి అభ్యర్థిగా కోలగట్ల వీరభద్రస్వామి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కోలగట్ల వెంకటరమణి వైసిపి తరపున మూడు సెట్లను, మల్లాప్రగడ బుచ్చి గురునాధశర్మ యుగతులసి పార్టీ తరపున ఒక సెట్ దాఖలు చేశారు. చీపురుపల్లి నియోజకవర్గంలో వైసిపి తరపున బొత్స సందీప్ రెండు సెట్లను, బొత్స సత్యనారాయణ ఒక సెట్‌ను దాఖలు చేశారు. నెల్లిమర్లలో స్వతంత్ర అభ్యర్థిగా కోల వర్షిణి నామినేషన్ వేశారు. బొబ్బిలిలో ముగడ వెంకటరమణ కాంగ్రెస్ పార్టీ తరపున, స్వతంత్ర అభ్యర్థిగా కూడా ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు.

కోలగట్ల ఆస్తులు రూ.29.40 కోట్లు / అప్పులు రూ.7.49కోట్లు

విజయనగరం టౌన్ : విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా నామినేషన్ వేసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తనపేరున, తన సతీమణి పేరున ఆస్తులు రూ.29కోట్ల 40లక్షల 90వేల 592గా అఫిడవిల్‌లో చూపించారు. ఇద్దరి పేరునా చరాస్తులు రూ.9,46,29,274 కాగా, స్థిరాస్తి రూ.19,94,61,318గా చూపించారు. అప్పు రూ.7కోట్ల 49లక్షల 29వేలు అని పేర్కొన్నారు. బ్యాంకు అకౌంట్‌లో నగదు తన వద్ద రూ.1,50,000, తన సతీమణి వద్ద రూ.1,11,660 ఉన్నట్లు తెలిపారు. బ్యాంకు డిపాజిట్లు అతని పేరుమీద రూ.3,30,35,876.39, భార్య రమణి పేరున రూ.3,79,798.09 ఉన్నాయి. కోలగట్ల వీరభద్రస్వామి వద్ద 1000 గ్రాములు బంగారం, భార్య వద్ద 2వేల గ్రాముల బంగారం ఉంది. కోలగట్ల వీరభద్రస్వామి పేరున (మిగతా..3లో)

మన్యం జిల్లాలో రెండే నామినేషన్లు

పార్వతీపురం రూరల్ : పార్వతీపురం మన్యం జిల్లాలో మూడోరోజు శనివారం అరకు పార్లమెంట్ స్థానానికి ఒకటి, కురుపాం అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి నామినేషన్లు దాఖలయ్యాయి. అరకు ఎస్‌టి పార్లమెంటరీ నియోజకవర్గానికి స్వతంత్ర (మిగతా..3లో)

విద్యుదాఘాతానికి రైతు బలి

మృతిచెందిన రైతు అప్పలనాయుడు

వ్యవసాయ బోరు బోర్డు వైరు తగిలి మృతి ● అంపిలిలో విషాదం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి పంచాయతీ పరిధి బొడ్డవలస గ్రామ సమీప పొలంలో శనివారం విద్యుత్ షాక్‌తో పాలకొండ మండలం అంపిలి గ్రామానికి చెందిన రైతు వావిలపల్లి అప్పలనాయుడు (58) అక్కడకక్కడే మృతి చెందారు. తన వ్యవసాయ భూములలో పంటలు ఎండిపోతున్నాయని, మోటార్ బోరు వేయటానికి వేకువజామున తన కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు. షెడ్‌లోకి వెళ్లి బోర్డు స్విచ్ ఆన్ చేసేందుకు ప్రయత్నించగా అక్కడ వేలాడి ఉన్న విద్యుత్తు తీగను తాకడంతో షాక్ కొట్టింది. అటుగా వెళ్లిన తోటి రైతులు ఎప్పటికీ నీరు రాలేదని గ్రహించి (మిగతా..3లో)

మాట్లాడుతున్న రాష్ట్ర వ్యయ పరిశీలకులు నీనా నిగం

ఆర్థిక లావాదేవీలపై పటిష్ట నిఘా

బ్యాంకు డిపాజిట్లపై దృష్టి : రాష్ట్ర వ్యయ పరిశీలకులు

ప్రజాశక్తి- విజయనగరం

ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆర్థిక లావాదేవీలు, ఖర్చులు, ఇతర వ్యయాలపై పటిష్ట నిఘా ఉంచాలని జిల్లా అధికారులను రాష్ట్ర వ్యయ పరిశీలకులు నీనా నిగం ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాల్సి (మిగతా..3లో)

23న చెల్లూరులో సిఎం బహిరంగ సభ

● విజయవంతం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షుడి పిలుపు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

ఈ నెల 23న మధ్యాహ్నం 4 గంటలకు విజయ నగరం మండలం చెల్లూరు వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభ జరుగుతుందని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వైసిపి అభ్యర్థి కోలగట్ల నామినేషన్ వేసిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బస్సుయాత్ర చేపడుతున్న విషయం తెలిసిందేనని అన్నారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరారు.

షెడ్యూల్ ఏరియా గుర్తింపునకు చిత్తశుద్ధి కరువు

● రీ సర్వే పేరుతో సాగదీత

● గిరిజనులను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

5వ షెడ్యూల్ ఏరియా పెంపునకు పాలక పార్టీల్లో రాజకీయ చిత్తశుద్ధి కొరవడింది. దీంతో, గిరిజన ప్రాంతంలోని భూములు, అటవీ, ఖనిజ సంపద లూటీ అవుతున్నాయి. ముఖ్యంగా 1/70 చట్టం వర్తించక పోవడంతో ఏజెన్సీలోని భూములు చాలా వరకు స్థానికేతర గిరిజనేతరులు చేత్లోకి పోతు న్నాయి. గిరిజన ప్రాంతంలో పుట్టి, పెరిగినా ఆయా గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చక పోవడం వల్ల కొండలు, డి-పట్టా భూములు ఆక్రమించుకోవడం వంటివి యథేచ్ఛగా సాగిపోతున్నాయి. చివరికి రాజ్యాంగం కల్పించిన హక్కులు, సంక్షేమ పథకాలను సైతం గిరిజనులు పొందలేకపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. ప్రతిపక్షం ప్రత్యేక పాత్ర పోషిస్తోంది. రీసర్వే పేరుతో సాగదీత ధోరణి అవలంభించడమే ఇందుకు తార్కాణంగా చెప్పకోవచ్చు.

అభివృద్ధికి దూరమైన దుడ్డుఖల్లు గ్రామం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి రాష్ట్రంలో అనేక సర్వేలు చేపట్టిన ఎపి గిరిజన సంఘం సుమారు 1200 గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్పించాలని డిమాండ్ చేస్తోంది. రాష్ట్ర విభజన తరువాత విస్తీర్ణం, జనాభా రీత్యా గిరిజన ప్రాంతం మన రాష్ట్రంలోనే ఎక్కువగా ఉంది. ఈనేపథ్యంలో కనీసం 700గ్రామాలను ప్రతిపాదించాల్సి వుందని గిరిజన సంఘాలు చెబుతున్నాయి. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పాముల పుష్పశ్రీవాణి అధ్యక్షతన 2019 నవంబర్ 12న జరిగిన గిరిజన సలహా మండలి సమావేశం 554గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్పించేందుకు తీర్మానించింది. ఇందులో విజయనగరం జిల్లాలో 182, శ్రీకాకుళం జిల్లాలో 240, విశాఖలో 91, తూర్పుగోదావరిలో 40, పశ్చిమగోదావరి జిల్లాలో ఒక గ్రామం చొప్పున ఉన్నాయి. ఈ ప్రకటనకు 20 రోజుల వ్యవధిలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పుష్పశ్రీవాణి యూటర్న్ తీసుకున్నారు. ప్రతిపాదిత షెడ్యూల్ గ్రామాల్లో కొన్నిచోట్ల అభ్యంతరాలు, మరికొన్ని గుర్తించాల్సిన గ్రామాలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో రీసర్వే చేస్తామని 2019 డిసెంబర్ 2న పుష్పశ్రీవాణి చెప్పారు. ఇందులో వాస్తవం ఉన్నప్పటికీ, సర్వే నివేదిక 35ఏళ్ల క్రితం నాటిదని కొత్తగా చెప్పడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

సాలూరు మండలంలో 90రెవెన్యూ గ్రామాలు ఉండగా, షెడ్యూల్ ఏరియాలోవున్నవి 24 మాత్రమే ఉన్నాయి. ప్రతిపాదిత గ్రామాలు 44 ఉన్నప్పటికీ మరో పది గ్రామాల వారు షెడ్యూల్ ఏరియాలో చేర్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మక్కువ మండలంలో 21పంచాయతీల పరిధిలో సుమారు 54 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇందులో కేవలం శంబర గ్రామానికి చెందిన బీరమాసి ఒక్కటే షెడ్యూల్ ఏరియా పరిధిలోవుంది. మండలం మొత్తం అటవీ ప్రాంతంలోవుండడం, మెజార్టీ గ్రామాల్లో ఎక్కువ మంది గిరిజనులు ఉండడం వల్ల 52గ్రామాలు షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని గిరిజన సంఘాలు ఏళ్లతరబడి డిమాండ్ చేస్తుండగా మిగతా..3లో)

జనసేనలో 50 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి -పూసపాటిరేగ

మండలంలోని చింతపల్లికి చెందిన 50 మత్స్యకార కుటుంబాలు శనివారం నెలిమర్ల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి ఆధ్వర్యంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. చింతపల్లి పంచాయతీకి చెందిన అల్లుడు శ్రీను, రాయితి రాము, గుండా రాంబాబు సమక్షంలో పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం గాలికి వదిలేసిందన్నారు. అందుకే ఈ ప్రభుత్వంపై విసిగినవారంతా ప్రత్యక్షంగా, పరోక్షంగా జనసేనలోకి వస్తున్నారన్నారు. మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా ఎన్‌డిఎ కూటమి పనిచేస్తుందన్నారు. మత్స్యకారులంతా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి పార్టీలోకి వస్తున్నారన్నారు. మత్స్యకారులకు రాబోయే తమ ప్రభుత్వం మంచి చేయనుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కో ఆర్డినేటర్ గడివాడ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో స్టీల్‌ప్లాంట్‌కు నష్టాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే విశాఖ ఉక్కు పరిశ్రమకు నష్టాలు వస్తున్నాయని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదంతో పోరాటం చేసి 33మంది బలిదానాలు చేస్తే స్టీల్‌ప్లాంట్‌ను ఏర్పాటుచేశారని, దీనిని కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ చేసేందుకు కుట్ర పన్నుతోందని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు నాసిరకం బొగ్గు సరఫరా చేయడంతో నష్టాలు వస్తున్నాయన్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనతో సభ్యులు ఉన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఎంపిడిఒ సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా సాగింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో తీర్మానాలు చేసే ఆస్కారం లేదని, ప్రజలకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వాటిపై సమావేశంలో మాట్లాడవచ్చని ఎంపిడిఒ తెలిపారు. ఎంపిటిసి సింహాచలం మాట్లాడుతూ ఎస్.కోట పట్టణంలో ఇంటింటి నీటి కొళాయి పనులు చేపడుతున్నారని, నీటిని ఎప్పటిలోగా సరఫరా చేస్తారని ప్రశ్నించారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సత్యకిశోర్ వారం రోజుల్లోగా నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ధర్మవరం సర్పంచ్ గాలి సన్యాసియ్య మాట్లాడుతూ పంచాయతీ ఇఒ బదిలీ అయ్యి ఆర్నెల్లు కావస్తున్నా నేటికీ వేరొకరిని నియమించలేదన్నారు. ఇన్‌ఛార్జి కార్యదర్శి ఏ ఒక్కరోజూ విధులు సక్రమంగా నిర్వర్తించలేదన్నారు. ఎంపిపి సండి సోమేశ్వరరావు స్పందిస్తూ ఇన్‌ఛార్జి పేరుతో ఎక్కడా సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని తనకు ఫిర్యాదులు అందాయని, తీరు మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ భరత్ కుమార్, ఇఒపిఆర్‌డి లక్ష్మి, పాల్గొన్నారు.

కోండ్రు ఆస్తి రూ.18.95 కోట్లు

ప్రజాశక్తి- రేగిడి

రాజాం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళి మోహన్ కుటుంబం ఆస్తి ప్రస్తుతం రూ.18.95 కోట్లుగా ఎన్నికల అధికారి జోసఫ్‌కు ఇచ్చిన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇందులో భాగంగా కోండ్రు మురళి పేరున రూ.2.13 కోట్లు చూపించగా, వ్యాపార లావాదేవీలు వినియోగానికి సంబంధించిన ఆస్తి రూ.48.87 లక్షలు చూపించారు. స్థల, వస్తు రూపేనా ఆస్తి రూ.1.64 కోట్లు చూపించారు. రూ.6,98,22,263 విలువైన బంగారం, వెండి ఆభరణాలు, వాహనాలు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ప్రజాశక్తి- మెరకముడిదాం

మే 13న జరగబోవు సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా ప్రజలు పోలీస్ సిబ్బందికి సహకరించాలని బుధరాయ వలస ఎస్ఐ లోకేశ్వరరావు కోరారు. శనివారం మండలంలోని బుధరాయవలస, గర్భాం, భైరిపురం గ్రామ పంచాయతీల పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమీషనర్ ఆదేశాలు ప్రకారం ప్రతి పౌరుడు ప్రశాంతమైన వాతావరణంలో నిబంధనలు మేరకు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

మరింత అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిని మరోసారి గెలిపించి మరింత అభివృద్ధికి సహకరించాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పల నాయుడు కోరారు. శనివారం బొప్పడాం, వల్లూరు, బొడ్డ పేట, తరిమి, పినతరిమి, మాల్యాడ, తమ్మాపురం, ఆల్తి పాలెం, గుషిణి, చనమల్లపేట తదితర గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి మరింత అభివృద్ధి ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యేగా తనను, సిఎంగా జగన్ మోహన్ రెడ్డిని, ఎంపిగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. ప్రతి పక్షాలు ఒంటరిగా వైసిపిని ఎదుర్కోలేక కూటమిగా కుతంత్రాలతో మాయ మాటలతో మభ్య పెడుతున్నాయని వారిని నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తనకు ఓటు వేసి వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ళ శ్రీరాములు నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు చనమల్ల వెంకట రమణ, జడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, బొప్పడాం సర్పంచ్ అంబళ్ల కిరణ్, నాయకులు పంచాది శ్రీరాములు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఇంటింటి ప్రచారం

డెంకాడ: మండల వైసిపి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడును, ఎంపి అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని గుణుపూర్ గ్రామంలో వైసిపి నాయకులు శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, ఎమ్మెల్యే తనయుడు వైసిపి ఐటి జోనల్ ఇన్‌ఛార్జ్ బడ్డుకొండ మణిదీప్ మాట్లాడుతూ రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డెంకాడ పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, గుణుపూర్ సర్పంచ్ సత్యం, డెంకాడ సర్పంచ్ పతివాడ గౌరి, మహిళా నాయకులు పతివాడ కృష్ణవేణి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకు పాలన

బొబ్బిలి: వైసిపి హయాంలో ప్రజల వద్దకు పాలన అందుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని 15వ వార్డులో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి ప్రజల వద్దకు పాలన అందిస్తున్నామని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ జి.రమాదేవి, వైసిపి నాయకులు శంబంగి శ్రీకాంత్, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారంలో ఎమ్మెల్యేలు బడ్డుకొండ, శంబంగి

బొబ్బిలి: సంక్షేమ పథకాలు గురించి వివరిస్తున్న శ్రీకాంత్

తండ్రి కోసం తనయుడు ప్రచారం

బొబ్బిలి నియోజకవర్గంలో తండ్రి కోసం తనయుడు విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. బొబ్బిలి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న శంబంగి వెంకట చినప్పలనాయుడును గెలిపించుకునేందుకు ఆయన కుమారుడు శంబంగి శ్రీకాంత్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యేగా తన తండ్రి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తామని హామీ ఇస్తున్నారు.

మిమ్స్ ఉద్యోగులు విధులకు హాజరు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగులు పోరాటం ద్వారా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించుకొని విజయం సాధించారని ఎక్కడైనా పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.వి.రమణ అన్నారు. మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు గత 80 రోజులుగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోరాటం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మిమ్స్ యాజమాన్యం దిగి వచ్చి డిఎ బకాయిలు చెల్లించడానికి, వేతన ఒప్పందం చేయడానికి, కాంట్రాక్టు ఉద్యోగులకు చట్ట ప్రకారం వేతనాలు ఇవ్వడానికి, ఎటువంటి వేధింపులూ బదిలీలు చేయమని, కేసులు ఉపసం హరించుకుంటామని అగ్రిమెంట్ చేయడంతో శనివారం నుంచి ఉద్యోగులు కార్మికులు విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మిమ్స్ గేటు వద్ద మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.వి.రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ ఐక్య పోరాటాలతో మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు న్యాయ మైన సమస్యల పరిష్క రించుకుని విధుల్లో చేరడం శుభపరిణా మం అన్నారు. ఉద్యోగులు, కార్మికులు ఎన్ని అవాంతరాలు ఎదురైనా మొక్కవోని దీక్షతో పోరాడి తమ హక్కులు సాధించుకున్నారని తెలిపారు. ఐక్యంగా ఉంటే ఎలాంటి సమస్యనైనా పరిష్కారం చెసుకోవచ్చని మిమ్స్ ఉద్యోగులు నిరూపించారని గుర్తు చేశారు. పోరాట సమయంలో మిమ్స్ ఉద్యోగులను ఎన్నో ఇబ్బందులు పెట్టినప్పటికీ పట్టు సడలకుండా అందరూ ఒకే మాట మీద నిలబడి వారు కోరుకున్న విధంగా డిమాండ్లు సాధించుకున్నారన్నారు. భవిష్యత్తులో ఈ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులకు సిఐటియు వెన్నుదన్నుగా నిలిచి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మిరప నారాయణ, నాయకులు కె.కాముసాయుడు, ఎం.నాగభూషణం, గౌరి, వరలక్ష్మి, మూర్తి, బి.బంగారునాయుడు, కె.మధు, ఎం.రాంబాబు, మూర్తి, అప్పలనాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

విధులకు హాజరవుతున్న ఉద్యోగులు

నామినేషన్ వేస్తున్న సందీప్

బొత్స సందీప్ నామినేషన్

ప్రజాశక్తి- చీపురుపల్లి

చీపురుపల్లిలో మంత్రి బొత్స సత్యన్నారాయణ తనయుడు బొత్స సందీప్ నాయుడు చీపురుపల్లి అసెంబ్లీకి నామినేషన్ వేశారు. శనివారం వారి మద్దతు దారులతో కలిసి చీపురుపల్లి ఆర్‌డిఒ కార్యాలయంలో ఆయన నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారిని బి శాంతికి అందజేశారు. శుక్రవారం రాష్ట్ర మంత్రి బొత్స సత్యన్నారాయణ నామినేషన్ వేయగా శనివారం ఆయన కుమారుడు నామినేషన్‌ని దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమానికి ఆయన వెంట పెద్ద ఎత్తున వైసిపి నాయకులు, కార్యకర్తలు వచ్చి ఆయనకి అనుకూలంగా నినాదాలు చేశారు.

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

వేపాడ : వేపాడలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యాన ఆ పార్టీ అధినేత చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గొంప వెంకటరావు కేక్ కట్ చేసి, చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, టిడిపి మండల ఉపాధ్యక్షులు పోతల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, ఐటిడిపి మండల అధ్యక్షులు సేనాపతి గణేష్, ఎస్‌సి సెల్ రాష్ట్ర నాయకులు దాసరి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మండల, పట్టణ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు

బొండపల్లి : బొండపల్లిలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలను మాజీ సర్పంచ్ జంపన లక్ష్మీ నారాయణ నివాసం వద్ద నిర్వహించారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కోరాడ కృష్ణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బండారు బాలాజీ, సర్పంచులు కర్రోతు శ్రీనివాసరావు, ముదునూరు శ్రీనివాసరాజు, మీసాల జానకీ రావు పాల్గొన్నారు.

గంట్యాడ : మండలంలోని గంట్యాడ గ్రామంలో టిడిపి అధినేత చంద్రబాబు జన్మదిన వేడుకలను ఆ పార్టీ మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కరనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ కేకు కట్ చేశారు. కార్యక్రమంలో అల్లు విజయ్ కుమార్, రంది చిన్న రామునాయుడు, రొంగలి కృష్ణ, బూడి అప్పల నాయుడు, పి.సంతోష్‌కుమార్, పైడిరాజు పాల్గొన్నారు.

దత్తిరాజేరు : దత్తిరాజేరు మండల కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, ఎంపిటిసి వంగపండు కృష్ణమూర్తి, బోడసింగి సత్తిబాబు, బంగారు నాయుడు, బండి కృష్ణ, తెలుగు మహిళా మండల అధ్యక్షులు గేదెల మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.



వేపాడ: కేక్ కట్ చేస్తున్న గొంప వెంకటరావు, తదితరులు

చీపురుపల్లి: గద్దే అనురాగ్ చౌదరి ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక నటరాజ్ రెసిడెన్సీ ఆవరణలో చంద్రబాబు జన్మదిన వేడుకను పురస్కరించుకొని భారీ కేక్‌ని కట్ చేశారు. అనంతరం అభిమానులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఆదివారం 21 ఏప్రిల్ 2024

అభివృద్ధి చూసి ఓటేయండి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

తెలుగుదేశం పార్టీ చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మొద్దు అని, మీరు ఇచ్చిన అవకాశంతో నగరాభివృద్దిని చూసి ఓటేయాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శనివారం వైసిపి అభ్యర్థిగా ఆయన నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి జయింట్ కలెక్టర్ కె.కార్తీక్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు వారి పాలనలో చేసిన అభివృద్ధి ఏమీలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ఐదేళ్ల కాలంలో తాగునీటి సమస్య , రోడ్లు కాలువలు, వీధిలైట్లు సమస్యలు 70శాతం పరిష్కారం చేశామన్నారు. మరో అవకాశం ఇస్తే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పని చేస్తానని తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపాలిటీగా ఉన్న నగరాన్ని నేడు కార్పొరేషన్ స్థాయిలో ఏ విధంగా అభివృద్ధి చేసేందుకు కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేసారో కళ్లకు కనిపిస్తోందన్నారు. కేంద్ర మంత్రులు గా చేసిన వారు, గత ఎమ్మెల్యే టిడిపి పాలకులు చేసింది ఏమి లేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ది ,సంక్షేమ పథకాలు చూసి ప్రజలు మరోసారి ఆదరించాలని కోరారు. ఎంపి, విజయనగరం పార్లమెంట్ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ నగరానికి, జిల్లా అభివృద్ధికి చేసిన కృషిని, సేవను గుర్తించి ఈ ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని ఆయన కోరారు. మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్ పాల్గొన్నారు.

శంబంగికి కేక్ తినిపిస్తున్న అతని సతీమణి

ఘనంగా శంబంగి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పక్కిలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి, మహిళా కౌన్సిలర్ల సమక్షంలో కేక్ కట్ చేశారు. శంబంగి దంపతులను సత్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే శంబంగికి వైసిపి నాయలులు, కౌన్సిలర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు.

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - విజయనగరం కోట

చంద్రబాబు ఒక మార్గదర్శకమైన నాయకుడని విజయనగరం నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. శనివారం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా అశోక్ బంగ్లాలో నాయకులు, కార్యకర్తలు మధ్య నిర్వహించారు. పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజుతో కలిపి ఆమె కేక్ కట్ చేశారు. అనంతరం టిడిపి నాయకులకు మిఠాయిలు పంచిపెట్టారు. పూసపాటి అశోక్ గజపతి రాజు మాట్లాడుతూ చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు తన సందేశాన్ని ఎప్పుడో ఇచ్చారరని ఎవరూ ప్రలోభాలకు లొంగకుండా ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఎటువంటి ఆధారాలూ చూపకుండా 52 రోజులు జైలులో పెట్టినా భరించి, ఈ నిరంకుశ ప్రభుత్వానికి సిగ్గు వచ్చేలా చేయడం మనందరం చూశామని గుర్తు చేశారు. పేర్ల వారి వీధిలో గల డెఫ్ అండ్ డమ్ పాఠశాలలో ఇద్దరు విద్యార్థులను దత్తత తీసుకోవడం కోసం అశోక్ గజపతి

కేక్ కట్ చేస్తున్న అదితి గజపతిరాజు, అశోక్ గజపతిరాజు

రాజు, సునీల గజపతిరాజు పేరు మీద రూ. 12వేలు చెక్కు, పాఠశాల యాజమాన్యానికి అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, విజయనగరం మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, రాష్ట్ర బీసీ నాయకులు వేచలపు శ్రీనివాసరావు, అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్, గాడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి రైతు బలి

(మొదటిపేజీ తరువాయి)

మోటార్ షెడ్ వద్దకు చేరుకుని చూసే సరికి అప్పలనాయుడు మృతి చెంది ఉన్నాడు. వెంటనే తన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు రేగిడి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించగా ఎఎస్ఐ రాజారావు, తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని అప్పలనాయుడు మృత దేహాన్ని పరిశీలించారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ రాజారావు తెలిపారు.

అంపిలిలో విషాదఛాయలు

రైతు అప్పలనాయుడు మృతి చెందడంతో అంపిలి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పొలం కెళ్ళి వస్తానని ఇంటి వద్ద చెప్పి ఇలా మృత్యువాత పడడం పలువురిని కంట తడి పెట్టించింది.

మళ్లీ నామినేషన్ వేసిన ముగడ

ప్రజాశక్తి-బొబ్బిలి

కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న పిసిసి సభ్యులు ముగడ వెంకటరమణ మళ్లీ నామినేషన్ వేశారు. ఈ నెల 18న రెండు సెట్లు నామినేషన్ వేసినప్పటికి తప్పులు ఉండడంతో శనివారం మరో రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. సాయిశ్రీకి అందజేశారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహిస్తున్న జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. అగ్నిమాపక కేంద్రం వద్ద అగ్నిప్రమాదాల నివారణపై సెమినార్, వర్క్‌షాప్‌ను నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ పద్ధతుల గురించి అగ్నిమాపక శాఖాధికారి షేక్ మదీనా వివరించారు.

షెడ్యూల్ ఏరియా గుర్తింపునకు చిత్తశుద్ధి కరువు

(మొదటిపేజీ తరువాయి)

గిరిజన సలహా మండలి ప్రతిపాదనలో కేవలం 26 మాత్రమే ఉండడం గమనార్హం. పాచిపెంట మండలంలో 54 రెవెన్యూ గ్రామాలకుగాను ప్రస్తుతం 21గ్రామాలు మాత్రమే షెడ్యూల్ ఏరియాలో ఉన్నాయి. మిగిలిన అత్యధిక గ్రామాల్లో గిరిజన జనాభాయే ఎక్కువగా ఉన్నప్పటికీ ఇటీవల కేవలం 17 గ్రామాలను మాత్రమే షెడ్యూల్ ప్రాంతంలో చేర్పించేందుకు ప్రతిపాదించారు.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గిరిజన మండలాల్లోనూ ఇదే పరిస్థితి దాపురించింది. ఇటువంటి పరిస్థితుల్లో 35ఏళ్ల క్రితం నాటి ప్రతిపాది జాబితాను అమలు చేసే బదులు, రీసర్వే చేపట్టడం మంచిదే. కానీ, ఆ పేరుతో కాలక్షేపం చేస్తుండడంతో గిరిజనుల్లో అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఇప్పటికే షెడ్యూల్ ఏరియాలో లేని గిరిజన గ్రామాల్లో స్థానికేతర పెత్తందారులు వందలాది ఎకరాలు ఆక్రమించుకుని రూ.కోట్లకు పడగలెత్తారు. పార్వతీపురం మండలంలోని బోడికొండ, సాలూరు మండలంలోని తామరకొండలో నిక్షిప్తమై ఉన్న మాంగనీస్ గనులను కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా కట్టబెట్టేందుకు నేటి వైసిపి, నాటి టిడిపి తీవ్ర ప్రయత్నాలు చేశాయి. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు ఏళ్ల తరబడి సాగు హక్కు కల్పించకపోగా, పట్టాలు కూడా ఇవ్వడం లేదు. గిరిజనులు అటవీ ఉత్పత్తులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నా ఆయా ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంది. చాలా గ్రామాలకు నేటికీ రహదారి సౌకర్యం లేకపోవడంతో అనారోగ్యానికి గురవుతున్నప్పుడు వారికి డోలీ మోతలే దిక్కవుతున్నాయి. ఈనేపథ్యంలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అనేకసార్లు సిపిఎం, గిరిజనసంఘాలు బంద్ నిర్వహించాయి. అటవీప్రాంత గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్పించాలని ఎపి గిరిజన సంఘంతోపాటు సిపిఎం దశాబ్దాలుగా పోరాడుతునే ఉన్నాయి. వీటికితోడు అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటుధర కల్పించాలని, సరవ భాషా వాలంటీర్లను మార్చి, ఏప్రిల్ నెలల్లో కూడా కొనసాగించాలని, జిఓ నెంబర్ 3 ప్రకారం షెడ్యూల్ ఏరియా పరిధిలోని ఉద్యోగాలన్నీ గిరిజనులతోనే భర్తీచేయాలని, గిరిజన డిఎస్‌సి ప్రకటించాలని తదితర డిమాండ్లతో ఈ ఏడాది మార్చి 10న ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లో బంద్ నిర్వహించారు. అయినా పూర్తిగా గిరిజనులు ఉన్న గ్రామాలను 5వ షెడ్యూల్ ఏరియాగా ప్రకటించాలన్న డిమాండ్‌ను పరిష్కరించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంగాని, రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలుగాని చొరవ చూపలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఎన్నికల్లో ముఖ్యంగా మన్యం జిల్లాలోని బిజెపి, వైసిపి ఎమ్మెల్యే, లోక్‌సభ అభ్యర్థులపై గిరిజనుల్లో వ్యతిరేకత వ్యక్తమౌతోంది. గిరిజనుల కోసం నిత్యం పోరాడుతున్న ఎర్రజెండా, సిపిఎంను గుర్తు చేసుకుంటున్నారు.

ప్రభుత్వ రాయితీలకు దూరం

దుడ్డుఖల్లు పంచాయతీ నాన్ షెడ్యూల్డుగా ఉండడంతో ఈ పంచాయతీలో ప్రజలు ప్రభుత్వ రాయితీలకు దూరమవుతున్నారు. ఐటిడిఎ ద్వారా ఎటువంటి రుణాలూ అందడం లేదు. దీంతో పూర్తిగా వెనుకబడి ఉన్నాం. మా గ్రామాన్ని షెడ్యూల్డు ఏరియాలో చేర్చాలి.

కొండ గొర్రి గోపాలరావు,
గిరిజన యువకుడు, దుడ్డుఖల్లు,
గుమ్మలక్ష్మీపురం మండలం

కోలగట్ల ఆస్తులు 29.40కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయ భూమి విలువ రూ.5,53,39,318 కాగా, ఆమె పేరునున్న వ్యవసాయ భూమి విలువ రూ.84,46,000గా చూపించారు. వ్యవసాయేతర భూమి కోలగట్ల వీరభద్రస్వామి పేరున రూ.7,31.10,000, వ్యాపార భవనాలు విలువ రూ.3,75,66, 000గా చూపారు. ఇలా అన్ని ఆస్తులు కలిపి రూ29.40కోట్లుగా చూపించారు.

గత ఐదేళ్లలో రెట్టింపైన ఆస్తులు

కోలగట్ల వీరభద్రస్వామి ఆస్తులు గత ఐదేళ్లలో రెట్టింపయ్యాయి. 2019ఎన్నికల సందర్భంగా ఆయన సమర్పించి అఫిడవిట్‌లో ఆయనతో పాటు తన భార్య పేరున చర, స్థిరాస్తులు కలిపి మొత్తంగా రూ.13కోట్ల 71లక్షల 10వేల 680గా చూపించారు. తాజాగా రూ.29కోట్ల 40లక్షల, 90వేల 592గా చూపారు. అంటే గత ఐదేళ్లలో రూ.15కోట్ల 69లక్షల 79వేల 912 విలువైన ఆస్తి పెరిగింది.

మూడోరోజు 14 నామినేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థిగా పాలక రంజిత్ కుమార్ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. కురుపాం ఎస్‌టి శాసనసభ నియోజకవర్గానికి మోసూరు నాగభూషణరావు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి బి.వి.రమణ తెలిపారు. మరే నియోజకవర్గంలోనూ నామినేషన్లు దాఖలు కాలేదు.

ఆర్థిక లావాదేవీలపై పటిష్ట నిఘా

(మొదటిపేజీ తరువాయి)

ఉందని పేర్కొన్నారు. ఆర్థిక లావాదేవీలు, నగదు బట్వాడా, బహుమతులు, ఇతర వస్తువులు తరలింపు, మద్యం రవాణా తదితర అంశాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. అధికారులు అందరిపట్లా నిష్పక్షపాతంగా వ్యవహ రిస్తూ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు. వ్యయ పరిశీలకులు ప్రభాకర్ ప్రకాష్ రంజన్, ఆనంద్ కుమార్, ఆకాశ దీప్‌లతో కలిసి ఆమె శనివారం స్థానిక కలెక్టరేట్ లో సమీక్ష నిర్వహించారు. తొలుత జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి జిల్లాలో చేపట్టిన ప్రణాళికను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఇప్పటి వరకు వస్తు, ధన రూపేణా రూ.4.2 కోట్ల నగదును సీజ్ చేశామన్నారు. ఫిర్యాదుల స్వీకరణ, మీడియా పర్యవేక్షణ, మోడల్ కోడ్ అమలు, సి విజిల్ తదితర సేవల కోసం 24/7 పని చేసేలా కంట్రోల్ రూమ్ నుంచి సేవలందిస్తున్నామన్నారు.

నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

అనంతరం రాష్ట్ర వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలను తప్పక పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జప్తు చేసిన వస్తువులు, నగదు పై కూడా దృష్టి ఉంచాలని తెలిపారు. అనంతరం పోలీస్, రెవెన్యూ, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో, డిఆర్ఐ, పోస్టల్, కస్టమ్స్, ఇన్ కంటాక్స్, బ్యాంకు, అటవీ, రైల్వే, ఐ.టి, జి.ఎస్.టి రవాణా తదితర శాఖల అధికారులు ఆయా విభాగాల ఆధ్వర్యంలో ఇప్పటి వరకు చేపట్టిన చర్యల గురించి వివరించారు. సమావేశంలో జెసి కార్తీక్, ఎస్.పి దీపికా పాటిల్, సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఎఎస్‌పి అస్మ ఫరీన్, డిఆర్ఒ అనిత, వ్యయ బృందాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వేధిస్తున్న భర్తను హతమార్చిన భార్య

అత్త, మామ హస్తమున్నట్లు ఆరోపణ

ప్రజాశక్తి - గరివిడి

కాళ్లు కడిగి కన్యాదానం చేసిన అత్తమామలే తమ కుమార్తెతో పాటు అల్లుడును హతమార్చిన సంఘటన వెదుళ్ళవలసలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ ఎల్. దామోదర్ రావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెదుళ్ళవలస యాత వీధికి చెందిన కొలుసు అప్పన్న (25) హత్యకు గురయ్యాడు. అప్పన్న, అతని భార్య కొలుసు దేవి మధ్య గత కొంతకాలంగా కుటుంబ కలహాలతో పాటు తీవ్ర మనస్పర్థలు, గొడవలు జరుగుతున్నాయి. దీంతో అప్పన్నను ఎలా అయినా హతమార్చాలనే దురుద్దేశంతో శుక్రవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో భార్య దేవి తన తల్లిదండ్రులైన ముంత సన్యాసిరావు, ముంత ఎల్లమ్మలతో కలిసి కొలుసు అప్పన్నను రాయితో తల మీద మోది, చున్నీతో మెడను బిగబెట్టి ఊపిరి ఆడకుండా చేసి హతమార్చారు. ఈ విషయమై సమాచారం అందుకున్న చీపురుపల్లి సిఐ సిహెచ్ షణ్ముఖ రావు, సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిఐ షణ్ముఖరావు

నీకెందుకు ఓటేయాలి?

మోదీ సాబ్!
నీకెందుకు ఓటేయాలి?
మా కార్మికులకు
నువు చేసిన మంచొకటి చూపు

మా సమ్మె హక్కును కాలరాసినవ్
సంఘం పెట్టడం కష్టం చేసినవ్
కనీస వేతనం నిరాకరించినవ్
పనిగంటలు పెంచినవ్
కాంట్రాక్టు పద్ధతి పెంచేసినవ్
ఉద్యోగ భద్రత లేకుండా చేసినవ్
సంక్షేమం ఎగ్గొట్టినవ్
చట్టాలన్నీ సవరించినవ్
హక్కులన్నీ హరించినవ్
చివరికి మమ్ము యాజమాన్యం
దయా దాక్షిణ్యాలకు వదిలేసినవ్

పోరాడితే
పోలీసులను ఉసిగొల్పుతున్నవ్
ఉద్యోగం పీకిస్తున్నవ్
మా ఐక్యతను దెబ్బతీసేలా
కుల చిచ్చులు పెడుతున్నవ్
మత ఘర్షణలు రేపుతున్నవ్

ఇది చాలక
ధరలు పెంచేస్తివి
పిల్లల చదువు వ్యాపారం చేస్తివి
వైద్యం ఖరీదు చేస్తివి
కుటుంబ పోషణ గగనం చేస్తివి

మేం సృష్టించిన సంపద
కార్పొరేట్లకు దోచి పెడతవ
మాకు ద్రోహం చేస్తివ
నక్క జిత్తులతో మోసగిస్తివ
దేముడి పేరుతో ఓట్లు దండుకుంటివ
నువు మాకు చేసిన మంచొకటి చెప్పు
నీ కెందుకు ఓటేయాలి?

మేం సాదాసీదా
జనమనుకుంటున్నవేమో!
ఆయుధాలున్న ఫిరంగులం
పిడికిలి బిగిస్తే అత్యంత శక్తివంతులం
తలుచుకుంచే తడాఖా చూపిస్తం
నీ భరతం పడతం
నిన్ను, నీ జోడీలను ఇంటికి పంపుతం

– ఎ.అజశర్మ,
ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక
ప్రధానకార్యదర్శి

ప్రచారం చేస్తున్న సిపిఎం కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ, నాయకులు

గిరిజన గ్రామాల్లో
సిపిఎం ముమ్మర ప్రచారం

ప్రజాశక్తి - కురుపాం

రానున్న సార్వత్రి ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని సిపిఎం కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ అభ్యర్థించారు. గిరిజన గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఓటును అభ్యర్థించారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలో ఉదయపురం, మొండెంఖల్ పంచాయతీల పరిధిలోగల పలు గిరిజన గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గిరిజన ప్రజలతో మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య చిచ్చుపెట్టి విద్వేషాలు రెచ్చగొట్టి మత హింసాలను సృష్టిస్తుందని విమర్శించారు. గిరిజనులకు రక్షణగా ఉన్న 1/70 చట్టాన్ని బలహీనపరుస్తూ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కోత పెట్టి ఐటిడిఎ, జిసిసిలకు వస్తున్న నిధులు తగ్గించి గిరిజనులకు ఉపాధి కల్పిస్తున్న ఉపాధి పథకంలో నిధులు కోత పెట్టిందని రాష్ట్ర విభజన హామీలను వెనకబడిన ప్రాంతాలకు నిధులు ఇవ్వకపోయినా రాష్ట్ర వైసిపి ప్రభుత్వం కేంద్రానికి ప్రశ్నించేది లేదని, రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో తెలుగుదేశం, జనసేన జతకట్టాయని ఈ నేపథ్యంలో గిరిజనుల హక్కులు సాధించుకోవడానికి గిరిజన ప్రాంతాన్ని రక్షించుకోవడానికి జీవో 3 సాధన కోసం ఉపాధి, విద్య, వైద్యం సక్రమంగా గిరిజనులకు అందాలంటే సిపిఎంతోనే సాధ్యమని కావున సిపిఎం పార్టీ అసెంబ్లీ, పార్లమెంటుఅభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు కె.అవినాష్, సిపిఎం నాయకులు పి.శంకర్రావు, ఎం.అడ్డమేశ్వరరావు, పి.వాసు, కె.ఈశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎ.అశోక్, బి.అనిల్ కుమార్, పువ్వల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌ను విజయవంతం చేయాలి

ఇండియా వేదిక మద్దతుతో సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను ఈ నెల 23న నామినేషన్ వేయనున్నానని ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ కోరారు. శనివారం స్థానిక సిపిఎం పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. నామినేషన్ ప్రక్రియ విజయవంతం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. కురుపాం నియోజక వర్గంలోని ఐదు మండలాల్లో ఉన్న కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, ఆమ్ ఆద్మీ పార్టీల నాయకులు కార్యకర్తలు, అభిమానులు, స్నేహితులు పెద్ద సంఖ్యల హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సార్వత్రిక సంగ్రామం

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం-మన్యం
ఆదివారం
21 ఏప్రిల్ 2024

ఎన్నికల యజ్ఞం
ఎలక్షన్ విధుల్లో ఉద్యోగులే కీలకం

ఎన్నికల విధులంటే కత్తిమీద సాములాంటిదే. పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవడం పౌరుల బాధ్యత. ఇందుకోసం ఎన్నికల యంత్రాంగం రోజుల తరబడి శ్రమిస్తుంది. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడం వారికి పెద్ద సవాలే. జిల్లాలో ఎన్నికలకు సంబంధించి అన్ని విభాగాల నుంచి వేలాది మంది ఉద్యోగులు ఈ ప్రక్రియలో భాగస్వామ్యం అవుతారు. ఉద్యోగుల విధులు ఎన్ని దశల్లో ఉంటాయో తెలుసుకుందాం.

– ప్రజాశక్తి, విజయనగరంకోట

☞ రిటర్నింగ్ అధికారులు

జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఒ)ని నియమించారు. వీరికి అనుబంధంగా ఎఆర్‌ఒలు ఉంటారు. ఓటర్ల జాబితాలో రూపకల్పనలో వీరు పాల్గొంటున్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన బాధ్యత వీరిదే. ఇవిఎంలను, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించడంలో ఆర్‌ఒలదే ప్రధాన బాధ్యత.

☞ రూట్ ఆఫీసర్లు

పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని, ఎన్నికల సామగ్రిని చేర్చే బాధ్యత వీరిదే. పోలింగ్ సిబ్బందికి వీరు మార్గదర్శకం చేస్తారు. మారుమూల ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలకు ఇవిఎంలు, సిబ్బంది తరలింపు కోసం రవాణా ఇబ్బందులను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తారు. పోలింగ్ పూర్తయ్యాక ఇవిఎంలను స్ట్రాంగ్ రూములకు చేర్చే వరకు జాగ్రత్తలు తీసుకుంటారు.

☞ ఎంసిఎంసి బృందాలు

మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీతో సహాయ సంచాలకులు ఉంటారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు అనుగుణంగా కుల, మతాలపై, సంఘాలపై విమర్శలు, దాడులు, వ్యక్తిగత దూషణలపై ఈ బృందం నిఘా వేస్తుంది. పత్రికలు, ఛానళ్లలో వచ్చే కథనాలను పరిశీలించి ఆభ్యంతరకర అంశాలపై నివేదిక తయారు చేసి జిల్లా అధికారికి సమర్పిస్తారు.

☞ నోడల్ అధికారులు

ఒక్కో నియోజకవర్గానికి ఒక నోడల్ అధికారి ఉంటారు. పత్రికా సమాచారం, పోలింగ్ సిబ్బందికి ఆహారం సరఫరా వంటి బాధ్యతలు చూస్తారు.

☞ లైజన్ అధికారి

ప్రతి నియోజకవర్గానికీ ఒక లైజన్ అధికారి ఉంటారు. ఎన్నికల పరిశీలకులు ఆడిగే ప్రతి ప్రశ్నలకూ వీరు వెంటనే సమాధానం చెప్పాల్సి ఉంటుంది. లైజన్ అధికారి వద్ద వారికి కేటాయించిన నియోజకవర్గానికి సంబంధించిన సమస్త సమాచారం అందుబాటులో ఉంటుంది.

☞ బిఎల్‌ఒలు

జిల్లాలో ఒక్కో పోలింగ్ కేంద్రానికి బూత్ లెవెల్ అధికారి ఒకరు ఉంటారు. వీరంతా తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి విధులు నిర్వర్తిస్తుంటారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు చూడాల్సిన బాధ్యత బిఎల్‌ఒలదే. పోలింగ్‌కు వారం రోజుల ముందు నుంచీ స్లిప్పులు పంపిణీ చేసే బాధ్యత బిఎల్‌ఒలదే.

☞ సెక్టోరియల్ అధికారులు

ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద తాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్డి వంటి మౌలిక వసతుల కల్పన వీరి ప్రధాన బాధ్యత. ఎన్నికల నిర్వహణపై పూర్తిస్థాయి అవగాహనతో పనిచేయాల్సి ఉంటుంది. పది పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టోరియల్ అధికారి ఉంటారు.

☞ వీడియో చిత్రీకరణ

ఒక్కో నియోజకవర్గానికి ఒక వీడియో సర్వేలెన్స్ బృందం ఉంటుంది. ఇద్దరు వీడియోగ్రాఫర్లు, ఒక రెవెన్యూ అధికారి ఇందులో ఉంటారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన అంశాలను, ఫిర్యాదులను చిత్రీకరించి నివేదికను తయారు చేసి కలెక్టర్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు పంపుతారు.

☞ ఫ్లయింగ్ స్క్వాడ్

ప్రతి మండలానికీ ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఉంటుంది. ఈ బృందాలు 24 గంటలూ అప్రమత్తంగా ఉంటాయి. అభ్యర్థుల ప్రచార ఖర్చులను నిఘా పెట్టి లెక్కిస్తారు. నిర్దేశించిన ఖర్చు దాటినట్లు అనుమానం వస్తే కమిషన్‌కు ఫిర్యాదు చేస్తారు.

☞ పోలీస్ బందోబస్తు

ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఎస్‌పి నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు బాధ్యతలు నిర్వర్తిస్తారు.

చట్టాలు.. శిక్షలు

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి ఎన్నికలే ప్రధాన భూమిక. ఈ ఎన్నికల నియమావళిని రూపొందించి పకడ్బందీగా అమలు చేయడానికి ఎన్నికల కమిషన్ పనిచేస్తుంది. ఎన్నికల నియమావళిని ఎవరు అతిక్రమించినా చట్టం తన పని తాను చేస్తుంది. ఎన్నికల సమయంలో ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనల ప్రకారం ఎక్కువగా కేసులు నమోదు చేస్తుంటారు. ఈ చట్టంలో అనేక సెక్షన్లు ఉన్నప్పటికీ ఎన్నికల సమయంలో కొన్నింటిని ఎక్కువగా నిబంధనలు అతిక్రమించిన పార్టీలపైనా, వ్యక్తులపైనా ప్రయోగిస్తుంటారు. ఆ చట్టాలేంటో.. వాటికేసే శిక్షలేంటో... ఓసారి పరిశీలిద్దాం.

– ప్రజాశక్తి, శృంగవరపుకోట

☞ 123 - ఆర్‌పి యాక్ట్

లంచగొండితనం, అనుచిత ఒత్తిడి, మతం, జాతి, కులం, సంఘం లేదా భాషా ప్రాతిపాదికపై పౌరుల మధ్య ద్వేషాన్ని, శత్రుత్వాన్ని పెంపొందించడం, లేక ప్రయత్నించడం చేస్తే దీన్ని ప్రయోగిస్తారు.

☞ 125 - ఆర్‌పి యాక్ట్

ఎన్నికల సందర్భంగా వివిధ గ్రూపుల మధ్య శత్రుత్వాన్ని పెంపొందిస్తే మూడేళ్ళ జైలు శిక్ష. జరిమానా. లేదా రెండూ అమలు చేయొచ్చు.

☞ 125అ - ఆర్‌పి యాక్ట్

తప్పుడు సమాచారం ఇచ్చినందుకు ఆరు నెలల జైలు శిక్ష. జరిమానా. లేదా రెండూ అమలు చేస్తారు.

☞ 126 - ఆర్‌పి యాక్ట్

ఎన్నికల సమయానికి 48 గంటల ముందు బహిరంగంగా సభలు నిర్వహించినా శిక్షార్హులే. అందుకు రెండు సంవత్సరాల జైలు శిక్ష. జరిమానా. లేదా రెండూ అమలు చేయొచ్చు.

☞ 127 - ఆర్‌పి యాక్ట్

ఎన్నికల సమావేశం సందర్భంగా ఎటువంటి అల్లర్లకు పాల్పడినా ఏ పోలీస్ అధికారి అయినా యుఎస్ 42 సిఆర్‌పిసి ప్రకారం ఆ వ్యక్తులను అరెస్టు చేయొచ్చు. అందుకు ఆరు నెలల జైలు శిక్ష. రెండు వేల జరిమానా. లేకుంటే రెండూ అమలు చేయొచ్చు.

☞ 127అ - ఆర్‌పి యాక్ట్

ఎవరైనా తన పేరు, చిరునామా లేకుండా ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు ముద్రిస్తే ఆరు నెలల జైలు శిక్ష. రెండు వేల రూపాయల జరిమానా. లేదా రెండూ అమలు చేయొచ్చు.

☞ 128 - ఆర్‌పి యాక్ట్

బహిరంగంగా ఓటేస్తే 3 నెలల జైలు శిక్ష. జరిమానా. లేకుంటే రెండూ అమలుకు అవకాశముంది.

☞ 129 - ఆర్‌పి యాక్ట్

ఎన్నికలకు సంబంధించిన అధికారులు, పోలీసులు పోటీచేసే అభ్యర్థికి సహకరించినా లేదా ప్రభావం కలిగించినా వారూ శిక్షార్హులే. అందుకు మూడు నెలల జైలు. జరిమానా. లేకుంటే రెండూ అమలు చేయొచ్చు.

☞ 130 - ఆర్‌పి యాక్ట్

పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్లలోపు ప్రచారం చేయకూడదు. ఒక వేళ ప్రచారం చేస్తే రూ.250 జరిమానా విధిస్తారు.

☞ 131 - ఆర్‌పి యాక్ట్

పోలింగ్‌స్టేషన్‌కు దగ్గరలో నియమాలకు వ్యతిరేకంగా ఎటువంటి ప్రచారం చేస్తే ఏ పోలీస్ అధికారి అయినా ఆ సామగ్రిని స్వాధీనం చేసుకోవచ్చు. అందుకు మూడు నెలల జైలు. జరిమానా. లేకుంటే రెండూ అమలు చేయొచ్చు.

☞ 132 - ఆర్‌పి యాక్ట్

ఓటేసే సమయంలో నియమ నిబంధనలు పాటించని వారికి మూడు నెలల జైలు శిక్ష. జరిమానా. లేదా రెండూ అమలు చేయొచ్చు.

☞ 133 - ఆర్‌పి యాక్ట్

ఎన్నికల సందర్భంగా ప్రజలను పోలింగ్ బూత్ వద్దకు చేరవేసేందుకు అక్రమంగా వాహనాలు సమకూర్చుట, అద్దెకు తీసుకొనుట నేరం. అందుకు మూడు నెలల జైలు శిక్ష. జరిమానా. లేకుంటే రెండూ అమలు చేస్తారు.

☞ 134 - ఆర్‌పి యాక్ట్

ఎన్నికల సందర్భంగా అధికార దుర్వినియోగం చేస్తే శిక్షార్హులే. అందుకు రూ.500 వరకు జరిమానా వేయొచ్చు.

☞ 134అ - ఆర్‌పి యాక్ట్

ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల ఏజెంట్‌గా గానీ, పోలింగ్ ఏజెంట్‌గా గానీ, ఓట్ల లెక్కింపు సందర్భంగా ఏజెంట్‌గా గానీ వ్యవహరించినా శిక్షకు అర్హులు. అందుకు మూడు నెలల జైలు శిక్ష. జరిమానా. లేదా రెండూ అమలు చేయొచ్చు.

☞ 134ఆ - ఆర్‌పి యాక్ట్

పోలింగ్ స్టేషన్ పరిసర ప్రాంతాలకు మారణాయుధాలు కలిగి వెళ్లడం నిషేధం. అతిక్రమించి వెళ్తే రెండు నెలల జైలు శిక్ష. లేదా జరిమానా. లేదా రెండూ అమలు చేయొచ్చు.

☞ 135 - ఆర్‌పి యాక్ట్

పోలింగ్ స్టేషన్ నుంచి ఇవిఎం అపహరించినా శిక్ష పడుతుంది. సంవత్సరం జైలు శిక్ష. రూ.500 జరిమానా. లేదా రెండూ అమలు చేయొచ్చు.

☞ 135అ - ఆర్‌పి యాక్ట్

పోలింగ్ బూత్‌ను స్వాధీన పరుచుకోవడం. ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి ఈ నేరం చేస్తే శిక్ష పడుతుంది. అందుకు సంవత్సరం తగ్గకుండా ఐదేళ్ల వరకు జైలు శిక్ష.

☞ 135ఆ - ఆర్‌పి యాక్ట్

ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల రోజు వేతనపు సెలవుగా మంజూరు చేసినా శిక్ష. అందుకు ఐదు వేల రూపాయల వరకు జరిమానా విధించవచ్చు.

☞ 135ఇ - ఆర్‌పి యాక్ట్

పోలింగ్ రోజు, కౌంటింగ్ రోజు మద్యం విక్రయించడం, పంపిణీ చేయడం నేరం. అందుకు ఆరు నెలల జైలు శిక్ష. రెండు వేల రూపాయల వరకు జరిమానా. లేదా రెండూ అమలు చేయొచ్చు.

నియోజకవర్గానికే మక్కువ
సాలూరు నియోజకవర్గంలో కీలకంగా మారిన మండలం

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ అనంతరం పార్వతీపురం నియోజకవర్గం నుంచి సాలూరు నియోజకవర్గంలో కలిసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ నియోజకవర్గాన్ని మక్కువ ఓ విధంగా ఏలుతుందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి కాదు. రాజకీయాల్లో అటు పార్వతీపురం నియోజకవర్గాన్ని శాసించడంలోనూ మక్కువ పాత్ర అప్పట్లో ఎక్కువనే చెప్పక తప్పదు. మరోవైపు నియోజకవర్గం మారిన తర్వాత కూడా అదే ధోరణి మక్కువ మండల ప్రజలు ప్రదర్శిస్తూ తమ నేతను గెలిపించుకుంటూ వస్తున్నారు. 2009లో ఏర్పడిన నియోజకవర్గం అనంతరం జరిగిన ఎన్నికల్లో మక్కువ మండలం మర్రివానివలసకు పీడిక రాజన్నదొరకు కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగారు. ఆయన టిడిపి అభ్యర్థి ఆర్‌పి భంజ్‌దేవ్ చేతిలో ఓడిపోయారు. అనంతరం భంజ్‌దేవ్‌కు కులవివాదం అడ్డురావడంతో కోర్టు తీర్పుతో రాజన్నదొర ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన విజయం సాధించడం వెనక మక్కువ ప్రజల ఆదరణ ఎంతైనా ఉందని చెప్పక తప్పదు. మండలంలో నాటి కాంగ్రెస్ నుంచి నేటి వైసిపి ప్రభుత్వం వరకు ఏకతాటిగా నడిపించుకొస్తూ ప్రత్యర్థి కంటే మెజారిటీ తీసుకుని వస్తున్న మండల నాయకులు మావుడి శ్రీనివాసరావు, రంగు నాయుడుల నిర్విరామశ్రమ ఇందులో మిళితమైంది. ఎప్పటివలే ఈసారి కూడా ఎమ్మెల్యే స్థానం కోసం ప్రధాన పార్టీల నుంచి పోటీ పడుతున్న అభ్యర్థులు ఇద్దరూ ఒకే మండలానికి చెందిన వారు కావడం గమనార్హం. టిడిపి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి స్వగ్రామం మండలంలోని కవిరిపల్లి. ఇప్పటి వరకు మంచి నాయకత్వంతో పాటు రాజన్నదొర వ్యక్తిత్వం కూడా ఆయన విజయానికి తోడ్పడుతూ వస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈసారి మండలంలో టిడిపి శ్రేణులను ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రజల ముందుకు వెళ్లా ఒకింత సానుభూతితో గెలుపొందుతానని నమ్మకంతో టిడిపి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి ప్రచారంలో ముందుకు కొనసాగుతున్నారు. ఏది ఏమైనా గెలుపు ఎవరిని వరించినా ఈదఫా కూడా సాలూరు నియోజకవర్గాన్ని మక్కువ మండల నేతల ఏలుబడిలోకి వెళ్లనుందన్న అభిప్రాయం ఇక్కడ ప్రజల్లో నెలకొంది.

మక్కువ గ్రామం

విశాఖ రాజధానిపై 70 ఏళ్ల క్రితమే
గొంతెత్తిన కూనిశెట్టి

ప్రజాశక్తి-సాలూరు

70 ఏళ్ల క్రితమే విశాఖ రాజధాని కావాలని గొంతెత్తిన సాలూరు మొదటి ఎమ్మెల్యే కూనిశెట్టి వెంకటనారాయణ దొర. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన మొదటి ఎన్నికల్లో గెలిచిన కూనిశెట్టి వెంకటనారాయణ దొర నియోజకవర్గ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. ఆచార్య ఎన్‌జి రంగా స్థాపించిన కృషికార్ లోక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి భాషాప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్ర అసెంబ్లీలో ఆనాడే ఆయన ఉత్తరాంధ్ర అభివృద్ధి జరగాలంటే విశాఖపట్నం రాజధాని కావాలని గొంతెత్తారు. ఆనాడు అసెంబ్లీలో రెండు సార్లు కూనిశెట్టి వెంకటనారాయణ దొర ప్రతిపాదన పై ఓటింగ్ జరిగితే ఒకే ఒక్క ఓటుతో తీర్మానం వీగిపోయింది. నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా వున్న సమయంలో విశాఖపట్నం లో నెల రోజుల పాటు వేసవి ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కూనిశెట్టి వెంకటనారాయణ దొర శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంజూరు చేయించారు. పట్టణానికి రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని తీసుకొచ్చారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో బ్రిటిష్ వారి అవసరాల కోసం సాలూరు బొబ్బిలి మధ్య రైలు బస్సు ఏర్పాటు చేశారు. తర్వాత దానిని నిలిపివేస్తే మొదటి ఎమ్మెల్యే కూనిశెట్టి వెంకటనారాయణ దొర రైలు బస్సు పునరుద్ధరణ చేయించారు.

కూనిశెట్టి వెంకటనారాయణదొర

గతమెంతో ఘనం

ప్రజాశక్తి-పాలకొండ

గతంలో నాలుగు నియోజకవర్గాలకు విస్తరించి ఉన్న పాలకొండ డివిజన్ పరిధి ప్రస్తుతం 2 నియోజకవర్గాలకు కుదించుకు పోయింది. 2004 వరకు ఉమ్మడి శ్రీకాకుళం లో 12 నియోజకవర్గాలు ఉండేవి. వాటిలో 4 నియోజకవర్గాలు పాలకొండ, పాతపట్నం, కొత్తూరు, ఉణుకూరు పాలకొండ డివిజన్ పరిధిలో ఉండేవి. 2009 ఎన్నికల నాటికి నియోజకవర్గ పునర్విభజన లో భాగంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 12 నియోజకవర్గాలను 10 నియోజికవర్గాలుగా కుదించారు. దీంతో డివిజన్ పరిధిలో ఉన్న కొత్తూరు నియోజకవర్గం పూర్తిగా కనుమరుగు అయిపోయింది. మరో నియోజకవర్గం ఉణుకూరు రాజాం నియోజికవర్గంగా కొత్తగా ఏర్పాటైంది. దీంతో పాలకొండ డివిజన్ పరిధిలో నియోజకవర్గాల సంఖ్య మూడుకు పడిపోయినట్లు అయ్యింది. తరువాత 2022లో జిల్లాల పునర్విభజన లో భాగంగా పాలకొండ డివిజన్ పరిధిని కుదించి మన్యం జిల్లా పరిధిలోకి తీసుకుని వెళ్లారు. దీంతో అప్పటికి డివిజన్ పరిధిలో ఉన్న మూడు నియోజకవర్గాల్లో పాతపట్నం నియోజికవర్గం శ్రీకాకుళం జిల్లాలో కొత్తగా ఏర్పడిన టెక్కలి సబ్ డివిజన్ పరిధిలోకి వెళ్లిపోగా, రాజాం నియోజకవర్గం విజయనగరం జిల్లాలో కొత్తగా ఏర్పాటు అయిన చీపురుపల్లి సబ్ డివిజన్ లోకి చేర్చారు. అప్పటివరకు పార్వతీపురం డివిజన్ పరిధిలో ఉన్న కురుపాం నియోజకవర్గాన్ని పాలకొండ డివిజన్‌లో కలిపారు. దీంతో పాలకొండ డివిజన్ లో పాలకొండ, కురుపాం రెండు నియోజకవర్గాలు మాత్రమే ఉన్నాయి.



నాటి నుంచి నేటి వరకు

పాలకొండ నియోజకవర్గం 1952లో ఏర్పాటు అయ్యింది. ఎంతో మంది ఉద్దండులు ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించిన ఘన చరిత్ర పాలకొండది. 1952 లో మొదటి ఎమ్మెల్యే గా పాలవలస సంఘంనాయుడు కాంగ్రెస్ తరపున గెలుపొందారు. 1955లో పైడి నరసింహ అప్పారావు ఇండిపెండెంట్‌గా గెలుపొందారు. 1962లో కెంబూరు సూర్యనారాయణ నాయుడు స్వతంత్ర పార్టీ తరపున గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1967 లో జె. జోగి అదే స్వతంత్ర పార్టీ తరపున గెలిచారు. 1972 లో కాంగ్రెస్ తరపున కొత్తపల్లి నరసయ్య గెలుపొందారు. 1978లో ఎస్సీలకు కేటాయించిన ఈ నియోజకవర్గంలో జనతా పార్టీ నుంచి కంబాల రాజరత్నం గెలుపొందారు. 1983లో టిడిపి ఆవిర్భావం తరువాత ఆ పార్టీ తరపున నియోజకవర్గం నుండి మొదటి ఎమ్మెల్యేగా గోనెపాటి శ్యామలరావు ప్రాతినిధ్యం వహించారు. 1985లో టిడిపి తరపున పోటీ చేసిన తలే భద్రయ్య గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1994లో కూడా ఆయన టిడిపి తరపున గెలిచారు. 1989 లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన పిజె అమత కుమారి తన సమీప ప్రత్యర్థి అయిన తలే భద్రయ్యపై గెలిచి మొదటిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆమెకు టికెట్ నిరాకరిస్తే ఇండిపెండెంట్ గా పోటీ చేసి గెలవడం విశేషం. 2004 ఎన్నికల్లో కంబాల జోగులు టిడిపి నుంచి గెలుపొందారు. తరువాత ఆయన పక్క నియోజకవర్గం అయిన రాజాం నుండి రెండుసార్లు విజయం సాధించారు. 2009 ఎన్నికల్లో ఎస్టీలకు కేటాయించిన ఈ నియోజకవర్గంలో నిమ్మక సుగ్రీవులు కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచి పాలకొండ వాణిని అసెంబ్లీలో వినిపించారు. 2014, 2019 ఎన్నికల్లో వైసిపి తరపున గెలిచిన విశ్వాసరాయి కళావతి ఈ ఎన్నికల్లో కూడా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి దామోదరరావు

11న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని మే 11న నిర్వహించనున్నట్టు రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు తెలిపారు. శనివారం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్అదాలత్ కార్యక్రమం స్థానిక కోర్టు ప్రాంగణంలో జరుగుతుందన్నారు. కక్షిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ కేసులను రాజీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చన్నారు. కోర్టుల చుట్టూ తిరగకుండా సాధ్యమైనంత మేరకు కేసులను రాజీ చేయడాని ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక సంఖ్యలో పాల్గొని పెండింగ్ కేసులను రాజీ చేసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, ఫస్ట్ క్లాస్ అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ డి.సౌజన్య, బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు..

శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలకు షోకాజ్‌లు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ ప్రజారోగ్య విభాగానికి సంబంధించిన ఇద్దరు శానిటేషన్ సెక్రటరీలకు, ఇద్దరు మేస్త్రీలకు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కమిషనర్ ఆకస్మిక వార్డు పర్యటనలో భాగంగా కొత్తవలసలోని 3, 4 సచివాలయాల పరిధిలో ఉన్న మణికంఠ కాలనీ, కొత్తపోలమ్మ కాలనీ, పెద్ద వీధి, నందమూరి కాలనీ, నవిరి కాలనీలలో పారిశుధ్య నిర్వహణ పనులు సక్రమంగా జరగకపోవడంతో సంబంధిత సెక్రటరీలు, మేస్త్రీలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. భవిష్యత్తులో పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం కొత్తవలస ప్రాంతంలో నీటి సరఫరా జరిగే సమయంలో అక్కడ ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పరిపాలనా దక్షుడు చంద్రబాబు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పరిపాలనా దక్షకుడు చంద్రబాబునాయుడని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. శనివారం చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలు ఆయన క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవితో కలిసి నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి కార్యకర్తలు, అభిమానులు, నాయకులకు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం గట్టెక్కించడానికి చంద్రబాబు వంటి నాయకుల పరిపాలన అనుభవం అవసరమన్నారు. అనంతరం నియోజకవర్గ కార్యాలయంలో చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బర్నాల సీతారాం, చీకటి బదరీ నారాయణ, కౌన్సిలర్లు కె.నారాయణ రావు, బడే గౌరినాయుడు, కోల మధుసూదనరావు, తాతపూడి వెంకటరావుతో పాటు బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

'సంధ్యారాణి ఏం చేశారో చెప్పాలి'

ప్రజాశక్తి- సాలూరు

ఆరేళ్ల పాటు ఎమ్మెల్సీగా పని చేసిన గుమ్మిడి సంధ్యారాణి నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆమె మండలంలోని దత్తివలస, కరకవలస గ్రామాల్లో ఇంటింటికి ప్రచారం చేశారు. నియోజకర్గంలో జరిగిన అభివృద్ధి పనులలో డిప్యూటీ సీఎం రాజన్నదొర చేసినవే 90శాతం ఉన్నాయన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో రోడ్లు, వంతెనల నిర్మాణానికి వందల కోట్ల రూపాయలు మంజూరు చేయించిన ఘనత ఆయనదని చెప్పారు. టిడిపి ప్రభుత్వం హయాంలో వందపడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేసి వదిలేస్తే 70శాతం పనులు చేయించిన నాయకుడు రాజన్నదొర అని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించకపోతే సంక్షేమ పథకాలు పేదలకు అందవని చెప్పారు. ఆమె వెంట స్థానిక వైసిపి నాయకులు లండ నాయుడు పాల్గొన్నారు.

వైద్య సేవలు సంతృప్తినిచ్చాయి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగన్నాథరావు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజల మనసుల్లో చెరగని వైద్యుడిగా పేరు గుర్తుండేలా రోగులకు వైద్య సేవలు చేయడంలో పొందే సంతృప్తి ఇంక దేనిలో ఉండదని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు అన్నారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయు సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడారు. మరిన్ని వివరాలు వారి మాటల్లోనే...

జిల్లాల పునర్విభజనకు ముందు శ్రీకాకుళం, ప్రస్తుత విజయనగరం జిల్లాలో ఉన్న సంతకవిటి మండలం గెడ్డవలస, నరసింహపురం (జిఎన్ పురం)లో 1962 మే 1న కీర్తిశేషులు బగాది పోలినాయుడు, వరలక్ష్మి దంపతులకు రెండవ సంతానం. ఒకటో తరగతి నుంచి ఆరో తరగతి ప్రాథమిక విద్యను స్వగ్రామంలో చదువుకున్నాను. ఏడో తరగతి నుండి పదో తరగతి వరకు సిరిపురం జడ్పీ హైస్కూల్లో చదవగా, పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్య పూర్తి చేశాను. ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ ఉన్నత విద్యను చదివాను. 1986లో కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్ ఉద్యోగానికి అవకాశం రాగా, అదే ఏడాది డిసెంబర్ 10న శ్రీకాకుళం జిల్లా జి.సిగడాంలో మెడికల్ ఆఫీసర్‌గా తొలుత ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. అప్పటి నుండి ఐదేళ్ల గుత్తావల్లి, తొగరాంలో వైద్య సేవలు చేస్తుండగా 1991 డిసెంబర్ 25న పర్మినెంట్ మెడికల్ ఆఫీసర్‌గా అవకాశం ఉంది. ఇక్కడ 12 ఏళ్ల వైద్య సేవలు అందించగా, 2002లో శ్రీకాకుళం అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ కు బదిలీపై వచ్చాను. 2007లో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా ఉద్యోగోన్నతిపై శ్రీకాకుళం జిల్లా బుడితికి బదిలీపై వచ్చి వైద్య సేవలందించాను. 2011లో సిహెచ్‌ఎన్‌సి ప్యాటర్న్‌లో ఆముదాలవలసకు బదిలీ అయింది. మళ్లీ 2017లో డిఐఒగా ఉద్యోగోన్నతిపై శ్రీకాకుళం బదిలీపై వచ్చాను. 2019లో సివిల్ సర్జన్‌గా ఉద్యోగోన్నతి పొంది శ్రీకాకుళం అడిషనల్ జిల్లా వైద్యాధికారిగా విధులు చేపట్టాను. అక్కడ నుంచి 2022 లో జిల్లాల పునర్విభజన జరగడంతో కొత్తగా ఆవిర్భవించిన పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీపై వచ్చి జిల్లా వైద్యాధికారి బాధ్యతలను చేపట్టి ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ వరకు ఇక్కడే విధులను నిర్వహిస్తున్నాను. రోజుకు 50కి పైగా రోగులకు ఓపి చూడడం సంతృప్తినిచ్చింది. తమ సర్వీస్ కాలంలో అత్యధికంగా 50వేల నుంచి 60 వేల వరకు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు చేసి లక్ష్యాలను అధిగమించడంలోనూ, డయేరియా అదుపు చేయడంలోనూ మంచి కృషి చేశాను. దీనికి ఫలితంగా 2004లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదగా రాష్ట్రస్థాయి అవార్డులు పొందడం చాలా సంతోషాన్నిచ్చింది. జిల్లాస్థాయిలో పది దఫాలు ఉత్తమ వైద్యునిగా ప్రశంసలు పొందడం ఆనందాన్నిచ్చింది. 2020లో కోవిడ్ మహమ్మారికి ప్రజలు భయాందోళన చెందారు. అనేకమంది వైద్యులతో సహా ప్రాణాలను పొట్టన పెట్టుకుంది. ఆ సమయంలో కోవిడ్ నోడల్ అధికారిగా అంకితభావంతో పనిచేయడం చాలా సంతృప్తిమిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇమ్యునైజేషన్ ప్రణాళికల్లో ఒక సభ్యునిగా ఉంటూ ప్రత్యేక గుర్తింపును పొందాను. ఇంత పేరు రావడానికి నా భార్య విజయలక్ష్మి అనుక్షణం తనకు తోడుగా నిలబడి సహకారం అందించడంతోనే సాధ్యమైంది. నా కుమారుడు సంతోష్ విట్‌లో బిటెక్ పూర్తి చేసి, అమెరికాలో ఎంఎస్ ఎంఎస్ పూర్తి చేశాడు. కుమార్తె డాక్టర్ శ్రావ్య చిల్డ్రన్ స్పెషలిస్ట్‌గా పనిచేస్తున్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కొంత కాలం విశ్రాంతి తీసుకొని మళ్లీ ప్రజలకు వైద్యసేవలందించాలని సంకల్పిస్తున్నాను.

జోరందుకున్న ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో చిరు వ్యాపారులకు అండగా ఉన్నానని, కావున తనకు మరోసారి అవకాశమివ్వాలని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. పట్టణంలోని పెదమార్కెట్‌లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఏనాడూ వ్యాపారులను బెదిరింపులకు పాల్పడలేదన్నారు. వ్యాపారుల ప్రయోజనాల కోసమే రోడ్ల విస్తరణ లేకుండా బైపాస్ రోడ్డు నిర్మాణానికి కృషి చేశానని చెప్పారు. టిడిపి అభ్యర్థి సంధ్యారాణి ఎలాంటి నాయకురాలో ఆపార్టీ కార్యకర్తలనే అడగాలని కోరారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, గొర్లె వెంకటరమణ, పిఎసిఎస్ అధ్యక్షులు యర్రా దాలినాయుడు, మాజీ కౌన్సిలర్లు కొల్లి వెంకటరమణ, పి.గోపి, వైసిపి నాయకులు హరి బాలాజీ, లింగాల సింహాచలం, ఎం.అప్పారావు వున్నారు.

పెదమార్కెట్‌లో ప్రచారం చేస్తున్న రాజన్నదొర

సీతంపేట : కుడ్డిపల్లిలో ప్రచారం చేస్తున్న జయకృష్ణ

కుడ్డపల్లిలో జనసేన ప్రచారం

సీతంపేట : కుడ్డపల్లిలో శనివారం ఉమ్మడి పార్టీల జనసేన పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఇంటింటికి వెళ్లి గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారం మండల టిడిపి అధ్యక్షులు సవర తోట మొఖలింగం, బిసి, ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఆర్ రంగనాథం, గంట సుధ, సర్పంచ్ నీయ్య, జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు బేబినాయన నామినేషన్

ప్రజాశక్తి-బొబ్బిలి

టిడిపి బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన సోమవారం నామినేషన్ వేయనున్నారు. ఉదయం ముఖ్యనాయకులతో కలిసి నామినేషన్ వేస్తున్నట్లు ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మరిశర్ల రామారావునాయుడు తెలిపారు. అదేరోజు సాయంత్రం కోట నుంచి పట్టణంలో భారీ ర్యాలీ చేసి బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఎండ తీవ్రత వల్ల సాయంత్రం ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నామని వివరించారు. ర్యాలీ, బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

టిడిపిలో చేరికలు

బొబ్బిలి : మండలంలోని మెట్ట వలసకు చెందిన 20 కుటుం బాలు టిడిపిలో చేరాయి. సర్పంచ్ పువ్వల మాధవరావు, మాజీ సర్పంచ్ కెల్ల తౌడు, శాస్త్రి ఆధ్వర్యంలో వారంతా టిడిపిలో చేరగా, ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన కండు వాలు వేసి ఆహ్వానించారు.

CHANGE OF NAME

I, Undersigned **VENKATARAJU DINAKAR PASUMARTHI** (Old Name), Resident of flat No.501,3rd floor, JP Palace, Old bus stand Road, Near Srikanth Lodge Parvathipuram, Vizianagaram Dist, Andhra Pradesh-535501, India changing my name from **VENKATARAJU DINAKAR PASUMARTHI** (Old Name) To **PASUMARTHI VENKATA DINAKAR** (New Name). Hence forth I am being called as **PASUMARTHI VENKATA DINAKAR** (New Name) for all practical purposes.

పరిశీలన పక్కాగా ఉండాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఎన్నికల నిర్వహణలో ఫ్లైయింగ్ స్క్వాడ్ బందాలు, వీడియో వ్యూయింగ్ బృందాలు పక్కాగా పరిశీలన చేయాలని అరకు పార్లమెంటరీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులుగా గుర్ కరణ్ సింగ్ అన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్, వీడియో వ్యూయింగ్ బృందాలతో జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో శనివారం వ్యయ నమోదుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారంలో భాగంగా నిర్వహించే ర్యాలీలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాలపై దృష్టి సారించాలని అందులో ఇమిడి ఉన్న ప్రతి వ్యయాన్ని పరిశీలించాలని స్పష్టం చేశారు. ఎక్కడా ఎటువంటి అశ్రద్ధ చేయరాదని ఆయన ఆదేశించారు. వ్యయ నమోదులో పాటిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, అరకు పార్లమెంటరీ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్ ఎస్ శోభిక, వ్యయ విభాగం నోడల్ అధికారి మరియు జిల్లా సహకార అధికారి పి శ్రీరామ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాల ప్రవేశ పరీక్ష

సీతంపేట : సీతంపేట ఐటిడిఎ పరిధిలోగల భామిని, మెళియాపుట్టి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతుల్లో ప్రవేశాలకు సీతంపేట బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన ప్రవేశ పరీక్షను ఐటిడిఎ డిప్యూటీ డైరెక్టర్ అన్నదొర శనివారం పరిశీలించారు. 490 మంది దరఖాస్తు చేసుకోగా 451 మంది పరీక్షకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గురుకులం సెల్ ఇంచార్జ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో శనివారం నిర్వహించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు 649 మంది విద్యార్థులు హాజరైనట్లు ఏటి డబ్ల్యూఒ సురేష్ కుమార్ తెలిపారు. 702 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా 53 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు తెలిపారు.

నేషనల్ సైన్స్ ఒలింపియాడ్‌లో సత్తా

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో జాతీయస్థాయి సైన్స్ ప్రాజెక్ట్‌లో విద్యార్థులు మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీరిని స్కూల్ ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఉత్తరాంధ్ర జిల్లాల ఏజీఎం సురేష్, ఆర్ఐ శ్రీనివాసరావు, కోఆర్డినేట్ బాలరాజు, ప్రిన్సిపాల్ జగదీష్, డీన్ సుదర్శన్, సి బ్యాచ్ ఇంచార్జ్ రవికుమార్, నాసా ఇంచార్జ్ రామకృష్ణ, ఐఎన్‌టిఎస్ఒ ఇంచార్జ్ గౌతమి, ఎఐ రామకృష్ణ, ప్రైమరీ ఇంచార్జ్ సంధ్య, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ శ్రీలత విద్యార్థులను అభినందించారు.

19 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని 19 మంది వాలంటీర్లు రాజీనామా చేసినట్టు ఎంపిడిఒ ఎఫ్ ఈశ్వరరావు తెలిపారు. శనివారం తామర కంటి, పెదంకలాం, కాశీపేట సచివాలయాల పరిధిలో వాలంటీర్లు రాజీనామా పత్రాలను అందజేసినట్టు ఆయన తెలిపారు.

హైస్కూల్ ప్లస్‌లో చేరండి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థినులు ఇంటర్మీడియట్‌కు ధర్మవరం హైస్కూల్ ప్లస్‌లోనే చేరాలని అధ్యాపకులు కోరుతున్నారు. ఇందులో భాగంగా ధర్మవరం హైస్కూల్ ప్లస్ హెచ్ఎం బి.ఉమామహేశ్వర రావు ఆధ్వర్యాన అధ్యాపకులు శనివారం ఆ గ్రామంలో పర్యటించారు. ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసిన హైస్కూల్ విద్యార్థినుల ఇళ్లను సందర్శించారు. ధర్మవరం హైస్కూల్ ప్లస్‌లో అందిస్తున్న ఉచిత విద్య, సదుపాయాలు, వసతుల గురించి వారి తల్లిదండ్రులకు వివరించారు.

పార్వతీపురం పట్టణంలో కురుస్తున్న వర్షం

ఏజెన్సీలో పలుచోట్ల వర్షం

ప్రజాశక్తి - మక్కువ, పార్వతీపురం రూరల్

ఏజెన్సీలోని పలు మండలాల్లో శనివారం సాయంత్రం వర్షాలు కురిశాయి. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గత నెలరోజులుగా ఎండల తీవ్రతతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఈ వర్షంతో ఊపిరి పీల్చుకున్నారు. కొమరాడ మండలం ఎండభద్ర, పూడేసు, మసిమండ తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ఉపశమనం పొందారు. మక్కువ మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. 44 డిగ్రీలపైబడి ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమయంలో కురిసిన వాన కొంతమేరకు వేడిని చల్లార్చింది.

పార్వతీపురం టౌన్ : గత పది రోజులుగా ఉష్ణోగ్రతలు రోజు రోజుకు అధికంగా నమోదు కావడంతో ఎండ వేడిమికి తాళలేక పట్టణ ప్రజలు నానా అవస్థలు పడ్డారు. శనివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఒక్కసారిగా గాలులతో కూడిన తేలికపాటి వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. మండలంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి చిరుజల్లులు పడడడంతో ప్రజలు ఊరట చెందారు. మండలంలోని గోచెక్క, డోకిశీల, తాళ్లబురిడి, లచ్చిరాజుపేట తదితర గ్రామాల్లో అక్కడక్కడ చినుకులు పడ్డాయి. పార్వతీపురం పరిసర గ్రామాల్లో పెద్దగా చినుకులు లేకపోయినా వాతావరణం మబ్బు పట్టి చల్లగాలులు వేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



గ్రామానికి పైపుల ద్వారా తెచ్చుకుంటున్న తాగునీటిని పరిశీలిస్తున్న సాంబమూర్తి

గిరిజనుల ఇబ్బందులు పట్టవా? : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన ప్రజా ప్రతినిధులుగా చలామణి అవుతున్నవారికి గిరిజనుల సమస్యలు పట్టావా అని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. నాయకులు కనీసం గిరిజనుల ఇబ్బందులు, సమస్యలను పట్టించుకునే పరిస్థితిలో లేకపోవడం గిరిజనులు చేసుకున్న దురదృష్టకరమని అన్నారు. శనివారం నయాలో గ్రావిటీ నీటి కోసం ఊటగెడ్డ వద్ద నిల్వ ఉన్న నీరును, గ్రామానికి నీరు తీసుకెళ్లేలా నిర్మించిన కుండీని, గ్రామం వరకు వేసిన పైప్ లైన్ను సాంబమూర్తి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నయా గిరిజన గ్రామంలో 52 గిరిజన కుటుంబాలు జీవిస్తున్నాయని, వేసవిలో ఉన్న బోరు పూర్తిగా మరమ్మతుల గురైంద న్నారు. దీంతో కిలోమీటర్ దూరంలో ఉన్న ఊట గెడ్డ నుంచి తాగడానికి,నీరు తెచ్చుకునేలా గ్రావిటీ నీటి కోసం గేడ్డ వద్ద ఒక కుండి నిర్మించారన్నారు. ఆ కుండీ నుంచి నయా గ్రామానికి కిలోమీటర్ దూరం ఉండటంతో పైపు కొనుక్కోవడానికి, కుండి నిర్మించడానికి, ఆ పైపును అండర్ గ్రౌండ్గా గ్రామం వరకు నిర్మించడానికి సుమారు లక్ష రూపాయలు ఖర్చు అయిందన్నారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి రూ.2500 వసూలు చేసుకొని పైపు లైన్ ఏర్పాటు చేశారన్నారు. వీధిలైట్లు కూడా లేవని చెప్పారు. సమస్యలను పరిష్కరించక పోతే పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతున్న సిపిఎం పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ఇలాంటి సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమ ంలో గ్రామానికి చెందిన గిరిజన పాల్గొన్నారు.

వేతనదారులకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి - గురుగుబిల్లి

ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో మండలంలోని గొట్టివలసలో శనివారం ఉపాధి కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అధికారుల ఆదేశాల మేరకు పనుల్లో పాల్గొన్న వేతన దారులకు ఒఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నామని క్షేత్ర సహాయకులు తెలిపారు. రోజు రోజుకు ఎండల తీవ్రత ఎక్కువ వుతున్న నేపథ్యంలో ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో నీడ నిమిత్తం స్థానికంగా లభ్యమయ్యే వనరులను వినియోగిస్తున్నట్టు తెలిపారు.

ఎమ్మెల్యే కళావతి ఆస్తులు రూ.2.01 కోట్లు

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ నియోజకవర్గంలో వైసిపి తరపున ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న విశ్వాసరాయి కళావతి ఆస్తులు రూ.2,01,45,614 ఉన్నట్టు శుక్రవారం ఆమె అందజేసిన అఫిడవిట్లో పేర్కొన్నారు. తన పేరున, తన భర్త మండంగి హరిప్రసాద్, కూతురు మండంగి సాయి వైష్ణవి పేరున ఉన్న ఆస్తులు, అప్పుల వివరాలు పొందుపరిచారు. ఈ అఫిడవిట్ ప్రకారం ఈమె పేరుతో రూ.11,29,000 స్థిరాస్తులు, చరాస్తులు విలువ రూ.58,03,793 ఉన్నట్లు అలాగే తన భర్త పేరున రూ.95 లక్షల స్థిరాస్తి, రూ.39,65,815 చరాస్తి ఉన్నట్లు, కుమార్తె పేరున రూ.2,45,000 విలువైన నాలుగు తులాల బంగారం, బ్యాంకులు అకౌంట్లో రూ.2,006 ఉన్నాయి. అలాగే తన మీద ఎటువంటి కేసులు కూడా లేవని పేర్కొన్నారు

వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాధరావు

హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి -పాలకొండ/వీరఘట్టం

హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు ఆదేశించారు. పాలకొండ, వీరఘట్టం మండలాలకు చెందిన పిహెచ్సిల వైద్యాధికారులు, సిబ్బందికి పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశాన్ని పాలకొండలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ గర్భిణుల నమోదు జరిగినప్పటి నుంచి ప్రసవం జరిగే వరకు పూర్తిస్థాయి ఆరోగ్య పర్యవేక్షణ ఉండాలని, మొదటి త్రైమాసికంలోనే గర్భిణుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని అన్నారు. త్వరగా వైద్య పరీక్షలు జరిపి హైరిస్క్ గర్భిణులను గుర్తించవచ్చని తెలిపారు. నమోదు సమయంలో గర్భిణులు ఆధార్ కార్డులో వివరాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలు స్పష్టంగా నమోదు చేయాలన్నారు. కావున వారికి మొదటి కాన్పుకు, ఆడబిడ్డ పుట్టిన రెండో కాన్పుకు పిఎంఎంవివై పథకం ద్వారా రూ.5వేలు వారికి జమ అవుతాయన్నారు. జెఎస్వై ద్వారా రూ.1000 జమ అవుతాయన్నారు. పిహెచ్సిల్లో సాధారణ కాన్పులు జరిగేలా చూడాలన్నారు. ప్రిజం-10 పక్కగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణీలు, బాలింతలు, శిశువులు, కిశోర బాలికల్లో రక్తహీనతగా ఉన్న వారిని గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వేసవి రీత్యా వడదెబ్బ, డీ హైడ్రేషన్పై ప్రజల్లో అవగాహన కల్పించి, జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. జ్వరాలు గుర్తిస్తే వెంటనే నిర్ధారణ పరీక్షలు జరపాలన్నారు. డ్రైడే పక్కాగా నిర్వహించి దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను నిర్మూలించాలన్నారు. దీర్ఘకాలిక రోగులు, టిబి వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం పై శ్రద్ధ చూపాలన్నారు. ఎఫ్డిపి, ఆరోగ్య సురక్ష, కంటి వెలుగు కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ ఎం.నారాయణరావు, డిఎంఒ డాక్టర్ టి. జగన్ మోహనరావు, ఆర్బిఎస్కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్, ఎఫ్డిపి ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతం జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ వై.అమ్మనరావు కోరారు. మండలంలోని బురదవెంకటాపురంలో శనివారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎటువంటి తగాదాలు, వ్యక్తిగత తగాదాలు, ఘర్షణలకు, దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. స్నేహపూర్వక వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహ కరించాని కోరారు. విధంగా గ్రామాల్లో చిన్న చిన్న విషయాలకు గొడవలుపడి పోలీస్ స్టేషన్ లు, కోర్టులు చుట్టూ తిరగవద్దని హితవు పలికారు. ప్రశాంత వాతా వరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. ఈసమా వేశంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ అమ్మనరావు

విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి : ఆర్ఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఎన్నికల దృష్ట్యా స్ట్రాంగ్రూం, రిటర్నింగ్ అధికారి కార్యాలయాలకు ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనకుమారి అన్నారు. శనివారం సంబంధిత విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ పాలకొండలోని స్ట్రాంగ్ రూం వద్ద ఇవిఎం యంత్రాల ర్యాండమైజేషన్, కమిషనింగ్, పోలింగ్ ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాలు ఉంటాయని, ఆ సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఇఇ గోపాలకృష్ణ, ఎఇలు జి.నీలిమ తదితరులు పాల్గొన్నారు.

23న రేగులపాడులో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని రేగులపాడులో ఈనెల 23న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మానస శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు స్వదినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

స్వతంత్ర అభ్యర్థిగా నాగభూషణ్ నామినేషన్

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం నియోజకవర్గ అసెంబ్లీ స్వతంత్ర అభ్యర్థిగా మోసూరు నాగభూషణ్ నామినేషన్ పత్రాలను శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఒ వివి రమణకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమరాడ మండలం సోమినాయుడు వలస పంచాయతీ గంగిరేగివలసకు చెందిన నాగభూషణ్ యువత రాజకీయాల్లో రావాలని ముఖ్య ఉద్దేశంతో తాను నామినేషన్ వేయడం జరిగిందన్నారు.

ప్రచార సభలో మాట్లాడుతున్న వీరేష్చంద్రదేవ్

గ్రామాల్లో టిడిపి అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని అర్తాం, అర్తాం గదబవలస, అర్తాం సీతమాంబపురం, దుగ్గి, కోటిపాం, కోటిపాం కొత్తకాలనీ, దేవుని గుంప, గుమడ, సీతమాంబపురం గ్రామాల్లో టిడిపి ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి వీరేష్ మాట్లాడుతూ తోయిక జగదీశ్వరీని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. తొలుత అర్తాం గ్రామంలో నారా చంద్రబాబు నాయుడు 74వ జన్మదిన వేడుకల్లో భాగంగా కార్యకర్తలు, నాయకుల మధ్య కేకు కటింగ్ చేసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు శేఖర్ పాత్రుడు, నాయకులు మధుసూదన్రావు, జి.సుదర్శన్ రావు, డి.వెంకటనాయుడు, ఎంపిటిసి సభ్యులు గంట వెంకటనాయుడు, సర్పంచులు శ్రీనివాసరావు, శంకర్రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టంలో టిడిపి..

వీరఘట్టం : మండల కేంద్రంలోని పాత బస్టాండు, దుర్గాపేట, యాద, తదితర వీధుల్లో శనివారం టిడిపి పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి సూపర్ సిక్స్పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉమ్మడి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు మీ ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో కూటమి నాయకులు బల్ల హరిబాబు, ఆర్ రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ ఎమ్మెల్యే ప్రచారం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని రేగులపాడు, కె.ఇచ్చాపురం, గదబవలస, కత్తుల కవిటి, తదితర గ్రామాల్లో శనివారం వైసిపి అభ్యర్థి వి.కళావతి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి మరొక్కసారి తనకు అవకాశం ఇచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో జడ్పిటిసి జంపు కన్నతల్లి- ఉమామహేశ్వరరావు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిమ్స్ కార్మికుల విజయం స్ఫూర్తి దాయకం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పోరాడితే పోయేదేమీ లేదు... బానిస సంకెళ్లు తప్ప... అన్నారు కారల్‌మార్క్స్ మహాశయుడు. మిమ్స్ (మహారాజా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్) ఉద్యోగుల పోరాటంలో అక్షరాల అదే జరిగింది. సుమారు 82 రోజులపాటు చేసిన పోరాటం ఫలించింది. యాజమాన్యం దిగిరాక తప్పలేదు. వేతన బకాయి, వేతన సవరణ, డిఎ బకాయిల చెల్లింపు సహా ఇతర సమస్యల పరిష్కారానికి భేషరతుగా హామీ ఇచ్చింది. ఇది కార్మిక విజయమని సిఐటియు ప్రకటించింది. ఈ విజయం వెనుక మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు, వారికి వెన్నుదన్నుగా నిలిచిన సిఐటియు నాయకుల నిర్భందాలు, అరెస్టులు, జైలు జీవితాలు కూడా ఉన్నాయి. ఇందులో ఉద్యోగుల ఆత్మవిశ్వాసం ఎనలేనిది. యాజమాన్యం వేధింపులు, బెదిరింపులకు వెరవకుండా విధులను బహిష్కరించారు. ఫిబ్రవరి 1న కళాశాల ఎదుట ఏర్పాటుచేసిన నిరసన శిబిరం విజయం సాధించే వరకు నిరాటంకగా కొనసాగింది. ఈ క్రమంలో యాజమాన్యం అనేక అణచివేత చర్యలు చేపట్టింది. పోలీసులను ఉసుగొల్పడంతో వారు చట్టాలను పక్కబనెబట్టి మరి ఉద్యోగులను, వారికి దన్నుగా నిలిచి పోరాడిన సిఐటియు నాయకులను అనేకసార్లు నిర్భందాలకు గురిచేశారు. ఇళ్ల వద్దా నిర్భందాలకు గురిచేశారు. చివరకు 23మందిపై నాన్‌బెయిల్‌బుల్ కేసులను పెట్టి మరీ జైళ్లకు పంపారు. అటు ఉద్యోగులు, ఇటు సిఐటియు నాయకులు కలిసి మొక్కవోని దీక్షతో చేసిన పోరాటం ముందు యాజమాన్యం వెనక్కి తగ్గక తప్పలేదు.

2003లో ఏర్పాటైన మిమ్స్ ఆసుపత్రిలో మిమ్స్ కాలేజీ, భోదనాసుపత్రిలో నర్సులు, ఎన్ఎంలు, ఆయాలు, వార్డు బాయ్స్‌తోపాటు ఎలక్ట్రికల్, పబ్లింగ్, అడ్మినిస్ట్రేషన్, లేబొరేటరీ, సెక్యూరిటీ తదితర విభాగాల్లో సుమారు 500మంది పనిచేస్తున్నారు. వీరంతా ఏళ్ల తరబడి చాకిరీ చేస్తున్నా వేతనాల పెంపు,

నెలవారీ సెలవులు, డిఎ సదుపాయం, వేతన సవరణ అంటూ ఉండేవి కాదు. దీనికి తోడు యాజమాన్యం నిరంకుశ వైఖరితో ఉద్యోగులు కూడా సంఘటితంగా ఉండలేని దుస్థితి ఉండేది. ఇంకా చెప్పాలంటే ఉద్యోగులు, ఒకరి ఇబ్బందులు మరొకరికి చెప్పుకోలేని పరిస్థితి ఉండేది. ఇదంతా 2011 సంవత్సరం నాటి ముందు మాట. అప్పటి వరకు పుట్టెడు దుఖంతో యాజమాన్యం వద్ద నలిగిపోతున్న ఉద్యోగులు అదే సంవత్సరం ఫిబ్రవరిలో సిఐటియును ఆశ్రయించారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని సిఐటియు నాయకత్వానికి వివరించారు. దీంతో, సిఐటియు కార్మికులను మరింతగా ఐక్యం చేసి మిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేసింది. మిమ్స్‌లోని 90శాతం ఉద్యోగులు సభ్యులుగా చేరారు. దీంతో, దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తూ అప్పటి వరకు ఏకపక్ష వైఖరితో ఉన్న మిమ్స్ యాజమాన్యం మెడలు వంచింది. కార్మికుల ఐక్యత, సిఐటియు పోరాటాల ముందు యాజమాన్యం పాచికపారలేదు. దిగివచ్చిన యాజమాన్యం 2011లో రెండేళ్ల వేతన ఒప్పందానికి ముందుకు వచ్చింది. ఆ తరువాత 2013, 2015, 2017 సంవత్సరాల్లో క్రమం తప్పకుండా వేతన ఒప్పందాలు జరిగాయి. 2011 అక్టోబర్ నుంచి 2020 అక్టోబర్ వరకు డిఎ పెరింగింది. ఇందుకు తగ్గట్టే ఉద్యోగులు యాజమాన్యానికి సహకరించారు. 2019 - కోవిడ్ సందర్భంగా ఉద్యోగులు ప్రాణాలకు తెగించి సేవలందించారు. ఓ రకంగా చెప్పాలంటే ఇక్కడి ఉద్యోగుల అంకితభావం అటు కాలేజీ, ఇటు బోధనాసుపత్రి ప్రతిష్ట పెంచింది. అయినా కార్మికులకు చెల్లిస్తున్న జీతభత్యాలు, ఇతర సదుపాయాల పట్ల మాత్రం కంటగింపుగా మారింది. యాజమాన్యం 2019లో చేయాల్సిన వేతన ఒప్పందానికి ముందుకు రాలేదు. దీంతో, సిఐటియు నాయకత్వంలో కార్మికులు గట్టిపోరాటాలే నిర్వహించారు. ఈనేపథ్యంలో ఎలాగైనా కార్మికల ఐక్యతను దెబ్బతీయాలని భావించిన యాజమాన్యం కొంతమందిని లోబరుచుకుంది. సిఐటియు మైనార్టీలో పడేలా చేసింది. ఇదే అదునుగా భావించి యాజమాన్యం డిఎలను నిలిపివేసింది. ఇతర సదుపాయాలనూ క్రమంగా రద్దుచేసింది. 2021 నుంచి పనిలో చిన్నపాటి పొరపాట్లు జరిగినా జరిమానాలు విధించడం లేదా వేతనాల నుంచి కోత విధించడం వంటి చర్యలకు దిగింది. చివరకు బలవంతపు అంగీకార లెటర్లు రాయించడం వరకు వెళ్లింది. ఇటీవల కాలంలో వేధింపులు ముమ్మరం చేయడంతోపాటు చిన్నపాటి పొరపాట్లను సాకుగా చూపి పలువురిని సస్పెండ్ చేసింది. దీంతో, కార్మికులు తిరిగి సిఐటియును ఆశ్రయించారు. తమపక్షాన యాజమాన్యంతో పోరాడాలని, వేతన సవరణ చేయడం లేదని, ఏడుసార్లు డిఎ పెంచాల్సి ఉందని, వేధింపులు, బెదిరింపులు ఎక్కువయ్యాయని చెప్పడంతో సిఐటియు మరోసారి పోరాటానికి దిగింది. ఫిబ్రవరి 1వ తేదీ నుంచీ కార్మికులు విధులు బహిష్కరించి, ఆసుపత్రి ఎదుటే నిరసన దీక్ష చేపట్టారు. ఈనెల 5న కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి కలెక్టర్‌కు తమ సమస్యను విన్నవించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 7వ తేదీన కార్మిక శాఖ డిప్యూటీ కమిషర్ (డిసిఎల్) చర్చలు ఏర్పాటు చేసినప్పటికీ సిఐటియు నాయకులతో చర్చించేందుకు యాజమాన్యం నిరాకరించింది. దీంతో, సిఐటియు నాయకులు లేకుండా తాము కూడా చర్చలకు వచ్చేది లేదంటూ కార్మికులు కూడా ఖరాఖండిగా చెప్పారు. దీంతో, విశాఖలోని కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ సమక్షంలో చర్చలకు వెళ్లాలని డిసిఎల్ సూచించారు. యాజమాన్యం మొండివైఖరి వీడకపోతే విధుల్లో చేరేది లేదని కార్మికులు, సిఐటియు నాయకులు ఖరాకండిగా చెప్పారు. దీంతో, ఎట్టకేలకు యాజమాన్యం దిగిరాక తప్పలేదు.

పార్టీలో చేరిన వారితో టిడిపి అభ్యర్థి అదితి విజయలక్ష్మి

24న అదితి నామినేషన్

ప్రజాశక్తి - విజయనగరం కోట

ఈ నెల 24న విజయనగరం నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను నామినేషన్ వేయనున్నాని అదిగి గజపతిరాజు తెలిపారు. స్థానిక అశోక్ బంగ్లాలో శనివారం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధలను కచ్చితంగా పాటిస్తూ నామినేషన్ వేయాలన్నారు. ఆదివారం అన్ని వార్డులలో కమిటీ సభ్యులు, బూత్ ఇంచార్జ్లు, కుటుంబ సాధికార సారధులు ప్రచారం చేపట్టాలన్నారు. ఈ నెల 24న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల ప్రజాగళం సాయంత్రం 4 గంటలకు విజయనగరం బాలాజీ కూడలిలో నిర్వహిస్తారని ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసేలా శ్రేణులు అందరూ కృషి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

విజయనగరం పట్టణం 9వ డివిజన్‌కు చెందిన సాఫ్ట్ వేర్ ఉద్యోగులు కోరాడ రఘు, కోరాడ సతీష్, కంటుభుక్త కృష్ణ వంశీ, ఇప్పిలి రోహిత్‌తో పాటు 20 మంది యువకులు శనివారం టిడిపిలో చేరారు. వీరికి అశోక్ బంగ్లాలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి అదితి గజపతిరాజు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

సన్యాసిరాజును అభినందిస్తున్న టెన్నిస్ అసోసియేషన్ సభ్యులు

జాతీయ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

ఈనెల 17 నుంచి బెంగుళూర్‌లో ఎఐఎస్‌టిఎ నిర్వహిస్తోన్న అలిండియా సీనియర్స్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ 65వ విభాగంలో విజయనగరానికి చెందిన పి.సన్యాసిరాజు విజయకేతనం ఎగురవేశారు. సింగిల్స్‌లో ద్వితీయ స్థానం, డబుల్స్‌లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. సన్యాసిరాజు విజయం విజయనగర జిల్లా టెన్నిస్ క్రీడాకారుల విజయమని టెన్నిస్ అసోసియేషన్ అభినందించింది. సన్యాసిరాజు ఎస్‌బిఐ ఉద్యోగిగా పదవీవిరమణ చేసి చింతలవలస క్రికెట్ అకాడమీకి సేవలు అందిస్తున్నారు. రంజీ మాజీ ప్లేయర్ సన్యాసిరాజు టెన్నిస్‌లో జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించారు. నేటికీ జాతీయ స్థాయిలో విజయనగరం క్రీడా ఖ్యాతి చాటుతున్నారని ఆఫీసర్స్ క్లబ్ టెన్నిస్ క్రీడాకారులు అభినందించారు.

మోహన్‌రావుకు జాతీయస్థాయి అవార్డు

ప్రజాశక్తి-బొబ్బిలి

పాత బొబ్బిలికి చెందిన ఉపాధ్యాయులు మింది విజయ మోహన్‌రావుకు జాతీయ స్థాయి ఇండియన్ ఐకాన్ అవార్డు లభించింది. ఆంగ్ల భాషలో పదేళ్లుగా విద్యార్థులకు సులభమైన పద్ధతుల ద్వారా ఆయన బోధన కృత్యాలు నిర్వహిస్తూ వారిలో ఆంగ్ల భాష పట్ల ఆసక్తిని పెంచే కార్యక్రమాలు చేపడుతున్నారు. శనివారం హిందుస్థాన్ టైమ్స్ ఆఫ్ ఇండియా మీడియా విభాగం క్రైట్స్‌క్రాఫ్ట్ సంస్థ ఆన్‌లైన్‌లో 'విద్యార్థుల విద్యాభివృద్ధి' అంశంపై నిర్వహించిన పోటీల్లో మోహన్‌రావును ఎంపిక చేశారు. మోహనరావుకు అవార్డు లభించడం పట్ల డెల్టా, యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్, రచనా సమాఖ్య, మనం బ్లడ్ డొనేషన్ క్లబ్, మనం పాత బొబ్బిలి, బొబ్బిలి ఫిల్మ్ సొసైటీ, గాంధీ స్మారక నిధి, దయ గల గోడ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

జనాలను మోసం చేసిన జగన్

జబర్దస్త్ నటుడు హైపర్ ఆది

ప్రజాశక్తి - భోగాపురం

మాట తప్పను..మడమ తిప్పనని చెప్పి జనాలను జగన్ మోహన్ రెడ్డి మోసం చేశారని జబర్దస్త్ ఆర్టిస్ట్ హైపర్ ఆది అన్నారు. మండలంలోని రావాడ గ్రామంలో జనసేన అభ్యర్థి లోకం మాధవికి మద్దతుగా శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట తప్పను మడమ తిప్పను అని చెప్పి మద్యపాన నిషేధం, పెన్షన్ల విషయంలో ప్రజలను మోసం చేశారని అన్నారు. ఇంట్లో ఉన్న చెల్లెకు మంచి చేయలేని వ్యక్తి రాష్ట్ర ప్రజలను ఎలా ఆదుకుంటాడని అన్నారు. 21 సీట్లను తీసుకొని ఏం చేస్తాడని పవన్ కళ్యాణ్‌ను అంటున్నారని ఆ 21 మందితోనే మీలో ఉన్న 151మంది అవినీతి

రావాడలో మాట్లాడుతున్న హైపర్ ఆది

అక్రమాలను బయటకు తీస్తామని అన్నారు. పవన్ కళ్యాణ్‌కు పిఠాపురంలో పక్కాగా లక్ష మెజార్టీ వస్తే నెల్లిమర్లలో లోకం మాధవికి 50 వేల ఓట్లు మెజార్టీ వస్తుందని అన్నారు. ఇక్కడ టికెట్ ఆశించినా రానప్పటికీ కర్రోతు బంగార్రాజు ఇంతలా సహకరించడం గొప్ప విషయమన్నారు. లోకం మాధవి మాట్లాడుతూ తాను లోకల్ కాదు నాన్ లోకల్ అని అంటున్నారని తాను మాత్రం లోకలేనని అన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ సైకో ముఖ్యమంత్రిని మళ్లీ గెలిపిస్తే రాష్ట్రం రావణ కాష్టమవుతుందన్నారు. జనసేనతో కలిసి పనిచేయాలని అపార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు, మాజీ ఎఎంసీ చైర్మన్ సూర్యనారాయణ రాజు, మహంతి చిన్నం నాయుడు, మట్టా అయ్యప్ప రెడ్డి, చెల్లుబోయిన నర్సింగరావు, కర్రోతు శ్రీనివాసరావు, మైలపల్లి నరసింహులు, తోగులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పాలిసెట్

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

ఈనెల 27న జరిగే పాలిసెట్‌కు పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డి అనిత ఆదేశించారు. పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష-2024 నిర్వహణపై తన ఛాంబర్‌లో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ, ఈ నెల 27న నిర్వహించే ఈ పరీక్షకు సుమారు 8864 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. విజయనగరంలో 11, గజపతినగరంలో 6, బొబ్బిలిలో 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. విజయనగరం సెంటర్లలో 4509 మంది, గజపతినగరంలో 2009 మంది, బొబ్బిలిలో 2346 విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఆరోజు ఉదయం 11 గంటలు నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని, విద్యార్థులను గంట ముందు లోపలకు అనుమతిస్తామని తెలిపారు. ఎట్టిపరిస్థితిలోనూ 11 తరువాత ఒక్క నిమిషం దాటినా లోపలికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఇతర వివరాల కోసం సెల్ నెంబరు 7989781520 నెంబరుకు సంప్రదించాలని డిఆర్‌ఒ సూచించారు. సమావేశంలో పాలిసెట్ జిల్లా కో-ఆర్డినేటర్ ఆషారాణి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, విద్య, విద్యుత్, వైద్యారోగ్య, పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, పరీక్షా కేంద్రాల కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

మా తల్లి గారు
కీ॥ శే॥ శిరుగుడి మాణిక్యం గారు
తే॥ 06-04-2024దిన స్వర్గస్తులైనారని
తెలియజేయుటకు మిక్కిలి చింతిస్తున్నాము
మీ పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ...
కీ॥శే॥ శిరుగుడి మాణిక్యం గారు
జననం: 1939
మరణం: 06-04-2024
కుమారుడు: శిరుగుడి వాసు
సెల్: 98660 29694
మరియు కుటుంబ సభ్యులు
పెద్దకర్మ: తేది 21-04-2024 ఆదివారం భోగాపురం గ్రామంలో మా స్వగృహమందు
ఉ॥ 11 గం॥లకు జరుపుటకు నిర్ణయించడమైనది. కావున, మీ అందరికీ తెలియజేయడమైనది.